సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 29.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13
సంచిక: 156
పేజీలు: 12
వెల: రూ. 5

# మూసీ ప్రక్షాళన తప్పదు

## హైదరాబాద్ మరో ఢిల్లీని చేయం

### విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గం

- మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఇదో దైవకార్యం.. అడ్డుకునే వారిపై శివతాండవం చేస్తాం
- ఉప్పల్-నాగోల్ లో చర్చి, పురానాపూల్‌లో మసీదును నిర్మిస్తాం
- గోదావరి జలాలను మూసీకి తరలించి నిరంతర జలప్రవాహం చేస్తాం



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** విపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మూసీ పునరుజ్జీవనం ఆగదని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ ప్రక్షాళనను ఒక యజ్ఞంలా భావిస్తున్నామన్న ఆయన దాన్ని అడ్డుకునే వారు ప్రజల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. కాలుష్య రహిత మూసీ ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ ప్రక్షాళన అనివార్యమన్న ఆయన లేకపోతే హైదరాబాద్ మహానగరం మరో ఢిల్లీలా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.శనివారం మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎనిమిది ఎకరాల్లో నిర్మించే ఈ క్షేత్రంలో వంద అడుగుల శివుడి విగ్రహం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చెప్పారు. మూసీ నది ఒడ్డున మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణ కార్యక్రమం దేవుడి నిర్ణయమన్నారు. అ ఆలయాన్ని నిర్మించడం భగవత్ కార్యంగా భావిస్తున్నామన్నారు. మూసీ నదిని బాగు చేయాలని గతంలో అనేక మంది ప్రయత్నించారన్న మిగతా 02లో

# వృత్తిపరమైన మీడియాను రాజకీయాల నుంచి దూరం చేయాలి

## ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు


### విజయవాడలో ఘనంగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) 11వ ప్లీనరీ



- పక్షపాత ధోరణి సమాజానికి ప్రమాదకరం అని హెచ్చరిక
- ప్లీనరీలో మీడియా స్వతంత్రత, జర్నలిస్టుల హక్కులపై కీలక చర్చలు
- వేతన సవరణలు లేక జర్నలిస్టుల పరిస్థితి దయనీయమని ఐజేయూ నాయకుల ఆవేదన
- డిజిటల్ మీడియా ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావంపై నేతల ఆందోళనలు

10

## జర్నలిస్టుల హక్కుల పునరుద్ధరణకు గళమెత్తిన ఐజేయూ



- వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం పునరుద్ధరణ, కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి
- రెండు దశాబ్దాలుగా వేతన సవరణలేదని ఆవేదన
- స్వతంత్ర మీడియా బలోపేతానికి చట్టాలు కావాలి

10



# రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు సొంత భవనాలు

## అంగన్‌వాడీ చిన్నారులకు తొలి ముద్ద ప్రారంభోత్సవంలో సీఎం



- వచ్చే మూడేళ్లలో పూర్తయ్యేలా ప్రణాళికలు, కార్యాచరణ
- పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- సంక్షేమం, కార్యక్రమాల అమలు గురుతర బాధ్యత అధికారులు, ఉద్యోగులదే
- అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబం
- ఆర్థిక వెసులుబాటుకు తగ్గట్టు సమస్యలు పరిష్కరిస్తాం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో కాకుండా వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవాల్లో కొనసాగేలా కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. శనివారం శాసనసభ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం "తొలి ముద్ద"ను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్న ఆలోచనతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని చేపట్టినట్లు వివరించారు. తల్లి గర్భంతో ఉన్నప్పుడు తల్లితో పాటు కడుపులోని శిశువు, పుట్టిన తర్వాత పిల్లలకు ఎలాంటి పోషకాహారం అందించాలన్న మిగతా 02లో

# బస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు

## మంత్రి పొన్నం ప్రభాకర్



- నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు
- ఆర్టీసీ సమస్యలపై ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధుల ముఖాముఖి

09

# అక్రమ మైనింగ్‌పై అట్టుడికిన అసెంబ్లీ

## అధికార, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం

- మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై నిలదీత
- శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్ పై మండిపాటు
- హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ సభ్యుల డిమాండ్
- స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లిన వైనం
- ప్రతిపక్ష సభ్యులకు భట్టి, శ్రీధర్ బాబు కౌంటర్
- ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీనానికి సీఎం తీర్మానం ప్రస్తావన
- నిరసన తెలిపిన హరీశ్ రావు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ శాసనసభ సమావేశాలు శనివారం ఆసక్తికరమైన చర్చల మధ్య కొనసాగాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై సభలో జరిగిన చర్చ శనివారంతో ముగిసింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు సంబంధిత మంత్రులు వివరణలు ఇచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వివిధ శాఖల బడ్జెట్ కేటాయింపులపై అధికార, ప్రతిపక్ష సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల వినియోగంపై చర్చ జరిగింది. పద్దులపై చర్చ పూర్తి కావడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను నేడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మిగతా 02లో

# సీఎంలో డిప్రెషన్ మొదలైంది

## రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారు
- దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించాలనుకుంటున్నారు
- 6 గ్యారంటీలపై ద్రుష్టి మళ్లించేందుకు అనేక డ్రామాలాడుతున్నారు
- కాళేశ్వరం డిజైన్ లోపం బాధ్యత కేసీఆర్ దే

03



# శతాబ్దాల చరిత్ర గలది అమరావతి

## ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



- అమరావతి రాజధానిగా కేంద్రానికి పంపే తీర్మానంపై చర్చ
- సింగపూర్ సహకారంతో రాజధాని నిర్మాణం

10

# దేశంలో ఇంధన కొరత లేదు

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


10



# ఐపీఎల్ ప్రారంభం

- నిప్పులు చెరిగిన ఇషాన్ బ్యాట్: 38 బంతుల్లోనే 80 రన్స్
- కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్న 'కావ్య' నమ్మిన బంటు..
- 18 బంతుల్లో 43 పరుగులతో అనికేత్ విధ్వంసం
- దంచికొట్టిన సన్ రైజర్స్ బ్యాటర్లు

11 బెంగళూరులో 'కిషన్' సునామీ



## హైదరాబాద్ పై బెంగళూరు విజయం


*బెంగళూరు వేదికగా జరిగిన ఐపీఎల్-2026 తొలి మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. 202 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించింది.*



# కేంద్రానికి మెట్రో విస్తరణ ప్రతిపాదనలు

- ఫేజ్ 1ను హెచ్ఎంఆర్ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయానికి అసెంబ్లీ ఆమోదం

02



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 29.03.2026
www.mudranews.in | @mudranews



ప్రెస్ ఫ్రీడమ్‌కు కట్టుబాటు
IJU
Indian Journalists Union
IJU ఎప్పుడూ మీడియా స్వేచ్ఛను కాపాడటానికి ముందుంటుంది. జర్నలిస్టుల హక్కులను ధైర్యంగా రక్షిస్తుంది.



# మూసీ ప్రక్షాళన తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం.. ఈ అవకాశం తమ ప్రభుత్వానికి దక్క డం అదృష్టమన్నారు. మూసీ వేదిక మత సామరస్యానికి కానుందని సీఎం వ్యాఖ్యానించారు. ఉప్పల్–నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి, పురానాపూ ల్‌లో మసీదు నిర్మిస్తామని వెల్లడించారు. అద్భుతమైన పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మూసీని తీర్చిదిద్దుతామని, గోదావరి జలాలను మూసీకి తరలించి నిత్యం జల ప్రవాహం ఉండేలా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం తమకు బాధ్యతే కాదు, పవిత్ర కార్యమని చె ప్పారు. నదీ పరీవాహక ప్రాం తాల్లోనే నాగరికత అభివృద్ధి చెందిందన్నారు. సముద్ర తీరంలోనే నగరాలు వెలిశాయన్న ఆయన దేశాల అభివృద్ధికి సముద్రాలు, నదు లే ఆధారమని చెప్పారు. నదీ జలాలను సరిగా వాడుకోకుంటే ఎంతో నష్టమన్నారు. తెలిసో తెలియకో నదులను కలుషితం చేస్తున్నామన్న సీఎం.. కాలుష్యంతోనే వచ్చే సమస్యలేంటో ఢిల్లీని చూస్తే తెలుస్తోందని చెప్పారు.

**పునరుజ్జీవాన్ని అడ్డుకుంటే శివ తాండవం..!**

ఈశ్వరుడి ఆశీర్వాదంతో మూసీ నది ప్రక్షాళన చేస్తామని సీఎం చెప్పారు. ఎవరైనా అడ్డుపడితే రాష్ట్ర ప్రభుత్వం శివతాండవం చేస్తుందని హెచ్చరించారు. కాలుష్యంతో భావితరాలు నాశనమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పిల్లలకు అనేక వ్యాధు లు వస్తున్నాయన్నారు. అసలు మూసీనది కా లుష్యం అనేది మానవ తప్పిదమని చెప్పారు. ఇది ప్రకృతి తప్పిదం కాదన్నారు మానవ తప్పి దాన్ని అరికట్టాలని లేకుంటే భావితరాలు నష్టపోతాయన్నారు. వాళ్లు చేయలేని పనిని ఎవ రూ చేయకూడదని కొంతమంది అడ్డుపడుతున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలు చూసి ఎన్జీటీలో కేసు ఎలా వేశారని నిలదీశారు. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు పటోళ్ల కార్తీక్ రెడ్డి వేసిన కేసును వెనక్కి తీసుకోవాలన్న సీఎం.. ఇప్పటికైనా మ నసు మార్చుకోవాలని సబిత్కను కోరుతున్నానని వెల్లడించారు. లేకుటే ఈ ప్రాంత ప్రజలు సామాజిక బహిష్కరణ చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతామని సీఎం స్పష్టం చేశారు.

**మూసీతో ఉమ్మడి నల్లగొండ అల్లాడుతోంది..**

హైదరాబాద్ కాలుష్యమంతా మూసీలో కలుస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి, దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరైడ్‌తో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప జలు రోగాల బారిన పడుతున్నారని, అందుకే మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని అ న్నారు. కానీ, కొందరు రాజకీయ కారణాలతో పనులను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని, గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

అంతకు ముందు గండిపేట మండలం మంచిరేవులలో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమే తంగా వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఓంకారేశ్వర స్వా మి ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఈ కా ర్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొ న్నారు. ఈ ఆలయ నిర్మాణానికి ఇప్పటికే డిజై న్ ఖరారు కాగా.. త్రీడీ వీడియోను కూడా ప్రభుత్వం రిలీజ్ చేసింది. చారిత్రక వీరభద్ర స్వామి ఆలయానికి సమీపంలోనే ఓంకారేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు. 8 ఎకరాల్లో రూ.700 కోట్లతో ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరగనుంది. మూసీ నదిలో 100 అడుగులు శివుని విగ్రహం ప్రత్యే క ఆకర్షణగా నిలుస్తుందని ప్రభుత్వం చెబు తోంది. పార్కులు, బోటింగ్‌తో పాటు విశాలమైన పార్కింగ్ కల్పించనున్నారు.

# కేంద్రానికి మెట్రో విస్తరణ ప్రతిపాదనలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కు మెట్రో నెట్‌వర్క్ విస్తరించాలనే వివిధ వర్గాల డిమాండ్ మేరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విస్తరణకు ఉన్న అడ్డంకులను, ఎదురవుతున్న ఇబ్బందులను లోతుగా సమీక్షించింది. ప్రస్తుతం ఉన్న మెట్రో ఫేజ్ 1 మొత్తం 69 కిలోమీటర్లు ఉండగా ఫేజ్ 2(ఏ) 76.4 కిలోమీటర్లు, ఫేజ్ 2 (బీ) 86.1 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రతిపాదనలను రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పరిస్థితిని శనివారం అ సెంబ్లీలో సభ ముంచుంచింది. ఫేజ్–1 ప్రైవే ట్ నిర్వహణలో ఉండగా, కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్–2 ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఎదురవుతున్న సాంకేతిక, చట్టపరమైన, నిర్వహణ స మస్యలను దృష్టిలోకి తీసుకుంది. కేంద్ర ప్రభు త్వం లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్ 1 నెట్‌వర్క్ ను రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎంఆర్‌ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయాన్ని ఈ సభ ఆమోదించింది. అందువల్ల.. మెట్రో ఫేజ్ 1 స్వాధీనం చేసుకునే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను గౌరవ సభ సమర్థించి, పూర్తి మద్దతు ప్రకటించింది. ఇందులో భాగంగా ఫేజ్–2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం త్వరగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని ఈ సభ కోరింది

# అక్రమ మైనింగ్ పై అట్టుడికిన అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ ప్రకారం, నేడు సభలో అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ జరగనుంది. ఈ బిల్లు ఆ మోదం పొందితేనే ప్రభుత్వం బడ్జెట్ నిధుల ను వెచ్చించేందుకు పూర్తిస్థాయిలో అనుమ తి లభిస్తుంది. కాగా, మార్చి 30తో బడ్జెట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో, చి వరి రెండు రోజులు అత్యంత కీలకం కాను న్నాయి. ప్రధానంగా పెండింగ్ బిల్లులు, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలపై సభలో మరిన్ని వేడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. తెలంగాణ శాసన సభ సమావేశాలు శనివారం ఆసక్తికరమైన చర్చల మధ్య కొనసాగాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై సభలో జరిగిన చర్చ శనివారంతో ముగిసింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు సంబంధిత మంత్రులు వివరణలు ఇచ్చారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వివిధ శాఖల బడ్జెట్ కేటాయింపులపై అధికార, ప్రతిపక్ష సభ్యులు సుదీర్ఘంగా చ ర్చించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప నులకు కేటాయించిన నిధుల వినియోగంపై చర్చ జరిగింది. పద్దులపై చర్చ పూర్తి కావడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను నేడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం, నేడు సభలో అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ జరగనుంది. ఈ బిల్లు ఆమోదం పొందితేనే ప్రభుత్వం బడ్జెట్ నిధులను వెచ్చించేందుకు పూర్తిస్థాయిలో అనుమతి లభిస్తుంది. కాగా, మార్చి 30తో బడ్జెట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యం లో, చివరి రెండు రోజులు అత్యంత కీలకం కా నున్నాయి. ప్రధానంగా పెండింగ్ బిల్లులు, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలపై సభ లో మరిన్ని వేడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది.

శాసనసభ సమావేశాలు శనివారం ఉద్రిక్తతకు దారితీశాయి. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' వ్యవహారం సభలో పెను దుమా రం రేపింది. బీఆర్ఎస్ సభ్యులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో జరుగుతున్న అక్రమాలపై చర్చ చేపట్టాలని పట్టుబట్టారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో, బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలు ఒక్కసారిగా స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వంపై నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు ఎమ్మె ల్యేలు మాట్లాడుతూ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతున్న పనులు, మైనింగ్ అక్రమాలు , టెం డర్లలో జరుగుతున్న అవకతవకలపై తక్షణమే హౌస్ కమిటీ వేయాలని ఎమ్మెల్యేలు డిమాం డ్ చేశారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని తన సొంత సంస్థకు లబ్ధి చేకూరుస్తున్నారని, దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సభా సమయాన్ని వృథా చేస్తున్నారని మం త్రులు మండిపడ్డారు. గందరగోళం మధ్యే సభను అదుపులోకి తెచ్చేందుకు స్పీకర్ ప్రయత్నించినప్పటికీ, సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభలో ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ ఆరోపణలను గతంలోనే తోసిపుచ్చినప్పటికీ, ప్రతిపక్షం మాత్రం ఈ విషయాన్ని వదిలిపెట్టలేదు. మొత్తానికి ఈ వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామం (సర్వే నంబర్ 62, 63)లో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతోందని, చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "లైసెన్స్ లేకుండా అక్రమ మైనింగ్ చేస్తే ఏడాది జైలు శిక్ష పడాలని చట్టం చెబుతోంది. మరి ఇన్ని నోటీసులు ఇచ్చినా, మైనింగ్ శాఖ లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని హరీష్ రావు ప్రశ్నించారు.

**ఇదేం న్యాయం..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును హరీష్ రావు గుర్తు చేశారు. "మహిపాల్ రెడ్డి తమ్ముడు నా తమ్ముడు లాంటి వాడు. 20 ఏళ్లుగా మేమంతా కలి సి పనిచేశాం. చిన్న తప్పు జరిగిందని ఆయ నను రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారు. మరి పొంగులేటి సంస్థపై ఎందుకు చర్యలు లేవు? ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పక్షానికి ఒక న్యాయ మా?" అంటూ నిలదీశారు. అక్రమ మైనింగ్ పై తాను ట్వీట్ చేస్తే.. మంత్రి పొంగులేటి తనను "మొరిగే కుక్కలు" అంటూ సంబోధించడాన్ని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. "నన్ను అంత మాట అన్నందుకే నేరుగా చెబుతున్నాను.. అది పొంగులేటి సంస్థే! అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు మా దగ్గ ర ఉన్నాయి. ఆయన మంత్రిగా ఉంటే విచార ణ సరిగ్గా జరగదు. అందుకే వెంటనే రాజీనా మా చేసి ఎంక్వైరీకి ఆదేశించాలి" అని డిమాండ్ చేశారు.

**నన్ను ఉరి తీయండి.. లేదా సస్పెండ్ చేయండి**

ఈ సందర్భంగా హరీష్ రావు ప్రభుత్వానికి సవాల్ చేశారు. "నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి లేదా ఎమ్మెల్యేగా సస్పెం డ్ చేయండి. ఒకవేళ నేను చెప్పేవి నిజా లైతే వెంటనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మీద కఠిన చర్యలు తీసుకోండి." అని హరీష్ రావు సంచ లన ప్రకటన చేశారు. ఈ పరిణామాలతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది, ప్రభు త్వం ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

**మండిపడ్డ భట్టి..**

బీఆర్ఎస్ నిరసనపై స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. రోడ్లపై అల్లరి చేసినట్లు బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందని ఆక్షేపించారు. వెల్ లోకి వచ్చి చప్పట్లు కొడుతూ నిరసన వ్యక్తం చేయడం ఇదెక్కడి సంప్రదాయం? పవిత్రమైన సభలో చిన్నపిల్లలాట లాంటి ఈ వ్యవహారం ఎక్కడిదన్నారు. బీఆర్ఎస్ తీరు సభను యావత్ ప్రజాస్వామ్యాన్ని అగౌరవ పరుస్తోందన్నారు. ఇదేం పద్ధతి అని మండిపడ్డారు.

**అక్రమ మైనింగ్ పై అట్టుడికిన అసెంబ్లీ..**

హైదరాబాద్ నగర శివారుల్లో, నగరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ సాగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. శాసన సభలో మైనింగ్ శాఖ డిమాండ్లపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న తీరును ఆధారాలతో సహా సభ ముందు ఉంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు 'కంచే చేను మేసినట్లు' ఉన్నాయని హరీష్ రావు విమర్శించారు. రక్షకులే భక్షకులుగా మారుతుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆరోపించారు. ముఖ్యంగా హైదరాబాద్ నడిబొడ్డున ఎటువంటి అనుమతు లు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ మైనింగ్ వ్యాపారాలు దర్జాగా సాగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదని ఆయన ప్రశ్నించారు. స్టోన్ క్రషర్ల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలను ఆయన సభలో ప్రస్తావించారు. ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 'తెలంగాణ స్టోన్ క్రషర్ రూల్స్ 2025' (జీఓ నెంబర్ 26) నిబంధనలను తుంగలో తొక్కి, నగర పరిసరాల్లో డీజిల్ జనరేటర్ల సహాయంతో క్రషర్లు నడుపుతున్నారని ఆరోపించారు. తాను సేకరించిన అన్ని డాక్యుమెంట్లను మంత్రికి అందజేస్తానని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని రాష్ట్ర ఆదాయాన్ని కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**సీబీసీఐడీ విచారణకు సీఎం ఆదేశం**

హరీశ్ రావు చేసిన ఆరోపణలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మైనింగ్ పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. సిరిసిల్ల ఇసుక మాఫియాపై సంతోష్ రావు, తండ్రి రవీందర్ రావు పై విచారణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అదే విధంగా గంగుల కమలాకర్ సంబంధించి ఇల్లీగల్ గ్రానైట్ మైనింగ్ పై విచారణకు సిద్ధంగా ఉన్నామన్నారు. వీరితో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్ పై విచారణకు సిద్ధమన్న సీఎం.. రాఘవ కన్స్ట్రక్షన్ తో పాటు వీటన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విచారణలో నిజాలు నిగ్గు తేలుస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎలాంటి తప్పిదాలు జరిగినా తమ ప్రభుత్వం ఉపేక్షించదని తేల్చి చెప్పారు.

**బీఆర్ఎస్ వాకౌట్**

శనివారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత పోలీసు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీ నుండి వాకౌట్ చేసింది. అంతకు ముందు మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శాసనసభలో మాట్లాడుతూ.. వడ్డించే వాడు మనవాడు అయితే లడ్డు ఎక్కడున్న వస్తుంది అంటారు కానీ, పోలీసు శాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉండి కూడా ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ పోలీసులను ఎం తో గౌరవించారని 40,50వేల పోలీసు పోస్టులు భర్తీ చేసి కొత్త కమీషనరేట్లు ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేశారని చెప్పారు. ఏడు టీఏ బిల్లులు, 3 సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆయన.. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారన్నారు. పెంచాల్సిన బడ్జెట్ ఎం దుకు తగ్గింది? అని ప్రశ్నించారు. అలాగే పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయడం లేదని పోలీసుల ఆరోగ్య భద్రత పథకం పై భరోసా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. .

**మెట్రో తీర్మానంపై హరీశ్ నిరసన..**

హైదరాబాద్ మెట్రోపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. దీనిపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి.. ఈ ఏకగ్రీవ తీర్మానానికి సభ్యులంతా ఆమోదం తెలపాలని కోరారు. మెట్రో విస్తరణకు ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే స్వాధీన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రజా రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగు పరిచి, మెట్రో నగరాన్ని అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు తీసుకొచ్చేందుకు కావలసిన ప్రణాళికలను రచించామన్నారు. అనంతరం మెట్రో స్వాధీనాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ క్రమంలో మెట్రోపై సీఎం చేసిన ప్రకటనపై హరీష్ రావు నిరసన తెలి పారు. ఇది ఏకగ్రీవ తీర్మానం కాదని, ఏకపక్ష తీర్మానమని విమర్శించారు.

**సభలో మంత్రి పొన్నం సెన్సేషనల్**

అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ శివపార్వతులు వారిద్దరి కుమారులకు సంబంధించిన చిత్రపటాన్ని సభలో ప్రదర్శించారు. దీంతో రూల్స్ ప్రకారం సభలో ఫోటో లు చూయించవద్దు కదా అని ప్రతిపక్ష సభ్యులు అడ్డు చెప్పడంతో తాను అనుమతి తీసుకున్నానని చెప్పారు. సభలో రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖకు కేటాయింపులపై చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నల కు మంత్రి సమాధానాలు ఇస్తూ.. శం కరుని పరివారానికి సంబంధించిన చిత్రపటంలో శంకరుని వాహనం నంది, పార్వతి వాహనం సింహం, కుమార స్వామి వాహనం నెమలి, వినాయకుడి వాహనం ఎలుక ఉం టాయి. వీటిలో ఒకదానికి మరొక దానితో పడదు. కానీ దైవభక్తి విషయంలో అన్ని కలిసే ఉంటున్నాయన్నారు.

**వాకౌట్ డ్రామాలొద్దు.. : మంత్రి శ్రీధర్ బాబు**

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై దుద్దిళ్ల శ్రీధర్ బాబు విరుచుకుపడ్డారు. సభలో చర్చ జరుగుతుంటే వాకౌట్ చేయడం బీఆర్ఎస్ సభ్యుల చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని మండిపడ్డారు. గత పదేళ్ల పాలనలో బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. పారదర్శకత కోసం టెక్నాలజీ ఆధారిత విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

**వచ్చే ఎనిమిదేళ్లూ మాదే అధికారం..**

ప్రభుత్వ కాలపరిమితిపై వస్తున్న ప్రచారాలకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. తమకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని.. ఆ తర్వాత కూడా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది తామేనని స్పష్టం చేశారు. అంటే మొత్తం ఎనిమిదేళ్ల సమయం తమకు ఉందంటూ సెటైర్లు వేశారు.

**కరీంనగర్ గ్రానైట్ పై విచారణకు సిద్ధమా..? మంత్రి వాకిటి.**

పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో.. ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా ఎలా జరిగిందో.. ఏ స్థాయిలో అరాచకాలు జరిగాయో తెలంగాణ రాష్ట్రం అంతా చూ సింది. బీఆర్ఎస్ హయాంలో.. మాజీ మంత్రి కేటీఆర్ నియోజకవర్గ పరిధిలోని నేరళ్ల గ్రామంలో జరిగిన ఇసుమా మాఫియాను గుర్తుకు తెచ్చుకోండి రోజుకు వెయ్యి లారీలతో ఇసుక మాఫియా రాజ్యం ఏలింది.

**ఆర్టీసీ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్**

ఆర్టీసీ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీలకు సంబంధించి చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ వాకౌట్ చేయడం సమంజసం కాదన్న ఆయన వాకౌట్ పేరుతో బీసీలను అవమాన పరిచే విధంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. శనివారం శాసనసభలో బీసీ సంక్షేమం, రవాణా, హోం శాఖ బడ్జెట్ చర్చలో భాగంగా మంత్రి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వం ఒక్క బస్సును కొనుగోలు చేయలేదని, ఆర్టీసీ సమ్మె పై ఉక్కుపాదం మోపారని, 45 వేల మంది కార్మికులను ఇబ్బందులకు గురి చేసిందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఈగ ల్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

**కరీంనగర్ సీపీపై ప్రభుత్వానికి అమిత ప్రేమ: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

కరీంనగర్ సీపీ బహిరంగంగా ఫైరింగ్ చేస్తే, సీపీ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? ప్రభుత్వానికి సీపీపైన ఎందుకు అంత ప్రేమారా ?ప్రభుత్వానికి పూర్తిగా చెడ్డ పేరు తెస్తున్న సీపీ పైన చర్యలు తీసుకోవాలి.

# రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు సొంత భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై సమగ్రంగా చర్చించిన తర్వాత ఈ కార్యాచరణ చేపట్టామని వివరించారు. ప్రభుత్వం ఎంత మంచి కార్యక్రమం తీసుకొచ్చినా, క్షేత్రస్థాయి సిబ్బంది సరిగా అమలు చేసినప్పుడే దీనికి గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ఆ గురుతర బాధ్యత సంబంధిత శాఖాధికారులు, ఉద్యోగులదే అన్నారు. ఆకలిని మీరు అమ్మగా అర్థం చేసుకుంటారని, సమస్యలపై మీకు అవగాహన ఉంటుందని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. .మొదటి ఆరేండ్లు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఇది అత్యంత కీలక దశ అన్నారు. ఈ సమయంలో ఆరోగ్యవంతమైన ఆహారం అందించకపోతే ఆశించిన ఎదుగుదల ఉండదన్న సీఎం.. దీన్ని గ్రహించి అత్యంత పకడ్బంధీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అత్యంత విలువైన బాల్య దశ మీ చేతుల్లో ఉందనే విషయాన్ని మరచిపోవద్దని చెప్పారు. దేశంలో జనాభాకు తగ్గట్టు పోషకాహారం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జబ్బులు వచ్చిన తర్వాత చికిత్స కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నామన్న సీఎం.. చికిత్స కన్నా జబ్బు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందనీ ఏమాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇ,చ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ధన సరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పలు అంగన్‌వాడీ టీచర్లు, పలువురు పిల్లలు పాల్గొన్నారు.

## జోగులాంబ గద్వాల జిల్లా యాసంగి క్రాప్ బుకింగ్‌లో
# రాష్ట్రంలో మూడవ స్థానం

**ముద్ర, గద్వాల:**

యాసంగి క్రాప్ బుకింగ్ ఈనెల 30న ముగియనున్న జిల్లాలో నమోదు ప్రక్రియ వేగవంతం చేసి వంద శాంతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి సీజన్‌లో జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1,73,707 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు గుర్తించామని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటివరకు 1,64,603 ఎకరాలకు క్రాప్ బుకింగ్ పూర్తి కాగా, 94.76 శాతం నమోదు సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లా మూడవ స్థానంలో నిలవడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ ఫలితానికి మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారుల సమిష్టి కృషి కారణమని అన్నారు. ఇంకా జిల్లాలో 9,104 ఎకరాల నమోదు మిగిలి ఉండగా, రెండు రోజుల్లో క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐజేయూ: అన్యాయాలపై స్పష్టమైన వైఖరి
ప్రభుత్వం లేదా సంస్థల తప్పిదాలపై ఐజేయూ నిర్భయంగా స్పందిస్తుంది. పారదర్శకత లేకపోతే గట్టిగా ప్రశ్నిస్తుంది.
IJU Indian Journalists Union



## ఇద్దరు సైబర్ నిందితుల అరెస్టు

**ముద్ర, ఖమ్మం :** ఆన్లైన్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 2 కోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందుతులను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ లోని వెస్ట్ గోదావరి జిల్లా, తణుకు పట్టణంలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ప్రకటించారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపార వేత్త కి వాట్సాప్ లో పరిచయమైన వ్యక్తులు ఆన్లైన్ లో ఎఫ్ ఎక్స్ ప్రో కంపెనీలో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 2 కోట్ల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను 7 లక్షలు రూపాయిలు అక్కౌంట్ కి వెళ్ళిన అక్కౌంట్ హోల్డర్స్ అయిన ఎండి. సాదిక్ (35సం), శ్యామ్ బాబు (21సం) లను , తణుకు లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ, సిహెచ్ ఆర్ వి ఫణిందర్, ఇన్స్పెక్టర్ కొండపర్తి నరేశ్ , ఎస్సై రంజిత్ కుమార్ , కానిస్టేబుల్స్ వెంకట కృష్ణరావు ,కిషన్ రావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## రాజీమార్గంలో కేసులకు పరిష్కారం

**ముద్ర, గద్వాల:** కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గద్వాల కోర్టు కాంప్లెక్స్ ఆవరణ లో నిర్వహించిన ఈ ఏడాదికి సంబంధించిన మొదటి జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సామ్ కోషి, జస్టిస్ శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ సామ్ కోషి మాట్లాడు తూ.. మెగా లోక్ అదాలత్ ద్వారా జోగులాం బ గద్వాల జిల్లాలో 5,345 కేసులు పరిష్కరించడం గర్వకారణమన్నారు. జస్టిస్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కక్షిదారులు చిన్న చిన్న తగాదాలతో కోర్టుల వరకు రావడంతో ఆయా న్యాయస్థానాల్లో పెద్ద ఎత్తున కేసులు పెండింగ్లో ఉంటున్నాయని, రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ కోర్టుల పరిధిలో మొత్తం 7846 కేసు లు అపరిష్కృతంగా ఉన్నాయని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా రాజీమార్గంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు కేసులకు సంబంధించి రాజీ అయిన పలువురు కక్షిదారులకు హైకో ర్టు న్యాయమూర్తులు అవార్డు కాపీలను అం దజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు యం త్రాంగం, బార్ అసోసియేషన్, పలువు రు న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తుల ను శాలువా, పుష్ప గుచ్చాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.



## అటవీ ఉత్పత్తుల విక్రయం అభినందనీయం

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**ముద్ర, భద్రాచలం :** గిరిజనులే పండించి, తయారు చేసి, సృష్టించిన అన్ని రకాల వస్తువులు ఒకేచోట లభించేలా భద్రగిరి మార్ట్ ప్రజలకు అందుబాటులోకి రావడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఇవి ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయన్న ఆయన ఇందుకు కృషి చేసిన ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ను అభినందించారు. భద్రాచలంలో ఏర్పాటు చేసిన ఈ మార్టును గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్ట్లోని అటవీ ఉత్పత్తులను గవర్నర్ పరిశీలించారు. ప్రజా ఉపయోగకర అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్లో అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే మంచి ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ట్రైబల్ మ్యూజియం వంటి వినూత్న కార్యక్రమాలతో గుర్తింపు పొందిన పీవో రాహుల్ భద్రగిరి మార్ట్ అందుబాటులోకి తేవడంతో మరో మైలు రాయిగా నిలుస్తుందని చెప్పారు. గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ మార్ట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్,భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గవర్నర్ కు ఘన స్వాగతం

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవానికి హాజరుకావడానికి భద్రాచలం విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లకు సారపాకలోని ఐటిసి హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఘనస్వాగతం పలికారు.



# ప్రజాపాలన ఉత్సవాలు

- ఏప్రిల్ 6న కాంగ్రెస్ బహిరంగ సభ
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తి
- హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం సమీక్ష



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** వచ్చే నెల 6న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఈమేరకు సభకు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్లో రాష్ట్ర ఉన్నత అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి నిర్వహించిన సమీక్షలో భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం తాను చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పిప్పిరి గ్రామం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. అందుకే ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా, పాదయాత్ర సమయంలో కొన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పత్రాలను అందజేస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి బాసరకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారనీ అనంతరం అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 2 గంటలకు పిప్పిరి గ్రామానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఆయన వివరించారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను, గత బిఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ ద్వారా ప్రొహిబిషన్ (నిషేధిత) జాబితాలో చేర్చిందని విమర్శించారు. రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర సందర్భంగా తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాటి సీఎల్పీ నేతగా తాను కలిసి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను వేధిస్తున్న ధరణిని రద్దు చేసి, పారదర్శకమైన వ్యవస్థను తెస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ మాట ప్రకారమే అధికారంలోకి రాగానే 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం అసైన్డ్ భూములను 'పార్ట్-బి'లో పెట్టి రైతులకు హక్కులు లేకుండా చేసిందని, కానీ తమ ప్రభుత్వం చట్టబద్ధంగా వారి హక్కులను కాపాడుతుందని స్పష్టం చేస్తూ, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు.

2004లో జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆడ వద్ద కొమరం భీమ్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటికీ, గత పది ఏళ్లుగా కాలువల నిర్మాణం పూర్తికాకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, కుడి, ఎడమ కాలువలను వెంటనే పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చికుమాను, పులిమడుగు, కుప్టీ త్రివేణి సంగమం ప్రాజెక్టులకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులపై వివరాలు ఆరా తీశారు. గిరిజనుల అభ్యున్నతి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా సాగును ప్రోత్సహించాలని సూచించారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధిలో రాణించేలా వారికి వడ్డీ లేని రుణాలు అందిస్తూ తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గతంలో పాదయాత్ర సందర్భంగా కేస్లాపూర్ లోని నాగోబా దేవాలయాన్ని సందర్శించినప్పుడు, మెస్రం వంశీయులు తమ సమస్యలను వివరించి ఆలయ అభివృద్ధిని కోరిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. ఈ ఏడాది జూన్ 2 నుండి ప్రారంభించబోయే నూతన పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్న ఆయన పాదయాత్రలో చాలా మంది పేదలు ఇళ్ల కోసం విన్నవించుకున్నారని గుర్తు చేశారు. ఏజెన్సీ, గిరిజన ప్రాంతా ల్లో మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినా వాటిని స్వీకరించాలన్నారు. అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

# రేవంత్ లో డిప్రెషన్ మొదలు

- ప్రధానిపై దిగజారుడు మాటలు
- దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు
- 6 గ్యారంటీలపై దృష్టి మళ్లించేందుకే డ్రామాలు
- కాళేశ్వరం డిజైన్ లోపం బాధ్యత కేసీఆర్ దే
- కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కు
- కవిత పార్టీని స్వాగతిస్తున్నాం
- సీఎంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



**ముద్ర, కరీంనగర్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుతో సీఎం రేవంత్ రెడ్డి డిప్రెషన్కు లోనయ్యారని ఆయన ఆరోపించారు. ఈ కారణంగానే ప్రధానమంత్రి స్థాయి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం కరీంనగర్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్ పనితీరును అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, రాష్ట్ర రాజకీయాలపై పలు అంశాలను ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని సీఎం చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని ఆయన విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనతో అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు జరుగుతుందని, దక్షిణాదికి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. 6 గ్యారంటీల అమలులో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు వివిధ అంశాలను లేవనెత్తుతోందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులకు రూ.4000 పెన్షన్, నిరుద్యోగ భృతి, రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు భరోసా కార్డు, మహిళలకు బంగారం, స్కూటీ వంటి పథకాలు ఇప్పటివరకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్ లోపాలపై స్పందిస్తూ, దీనికి ప్రధాన బాధ్యత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్దేనని బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ స్వయంగా డిజైన్లో జోక్యం చేసుకోవడం వల్లే లోపాలు తలెత్తాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం అవినీతి, డిజైన్ లోపాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారని, అందువల్లే బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. సీబీఐకి పంపిన నివేదికలో కూడా పూర్తి వివరాలు ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇక కవిత కొత్త రాజకీయ పార్టీపై స్పందిస్తూ, ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ స్థాపించవచ్చని, ప్రజల కోసం పనిచేసే పార్టీలకే ప్రజలు ఆదరణ ఇస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని, రాజకీయాలను పక్కనపెట్టి ప్రభుత్వం అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని బండి సంజయ్ సూచించారు.



## భూదాన్ భూములను పరిశీలించిన తుమ్మల

**ముద్ర, ఖమ్మం :** స్థానిక వెలుగుమట్లలో గల భూదాన్ భూములను మంత్రి తుమ్మల నాగేశ్వరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారు లకు సలహాలు, సూచనలుఇస్తూ పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , పోలీస్ సూపర్డెంట్ సునీల్ దత్ , మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 9,540 ఎంబీబీఎస్ సీట్లు

**న్యూ ఢిల్లీ:** తెలంగాణలో వైద్య విద్య సీట్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం లోక్సభలో వెల్లడించింది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.
తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 9,540 ఎంబీబీఎస్ (యూజీ) సీట్లు, 3,997 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నట్లు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సమాచారం ఆధారంగా తెలిపారు.

# నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేకం



**ముద్ర, భద్రాచలం:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మిధిలా ప్రాంగణంలో శనివారం అత్యంత వైభవంగా జరిగిన ఈ మహోత్సవంలో దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు.
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల మహోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఆశీస్సులు పొందారు. మహోత్సవాన్ని ఆద్యంతం తిలకిస్తూ భక్తి పరవశంలో పాల్గొన్నారు.
పట్టాభిషేక వేడుకలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. తొలుత రామాలయంలో భద్రుని మండపంలో స్వామివారి పాదుకలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గౌతమీ నదీ తీరంనుంచి పవిత్ర తీర్థములను తీసుకువచ్చి రాజ లాంఛనాలతో మిధిలా ప్రాంగణానికి ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చారు. భాజా భజంత్రీల నాదాలు, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటాలతో ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కళ్యాణ మండపంలో స్వామివారు ఆశీనులైన అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. తరువాత పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలతో స్వామివారికి రాజ లాంఛనాలు అలంకరించి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిధిలా ప్రాంగ ణం మొత్తం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగింది. అనంతరం భక్తులపై పుణ్య నదీ జలాలను చల్లి ఆశీర్వదించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం వంటి ప్రధాన వేడుకలకు హాజరైన భక్తులు తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగారు. ఈ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ఐటీడీఏ పీఓ రాహుల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం
29.03.2026

4 వేదిక Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇది.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# రాజకీయ ధ్రువతార... నర్రా రాఘవరెడ్డి

నేటి రాజకీయాల్లో విలువలు కంటే వెలుగులు, సేవ కంటే ప్రదర్శన, సిద్ధాంతం కంటే స్వార్థం ముందుకు వస్తున్న కాలం ఇది. పదవి దక్కగానే కాన్వాయ్‌లు, ఫ్లెక్సీలు, డీజేలు, పూలదండలు రాజకీయ సంస్కృతికి ప్రతీకలుగా మారాయి. ఎన్నికలంటే కోట్ల ఖర్చు, అధికారమంటే సంపాదన మార్గం అనే భావన బలపడింది. ఇలాంటి పరిస్థితుల్లో నీతి, నిబద్ధత, నిరాడంబరత అనే మూడు స్తంభాలపై తన రాజకీయ జీవితం నిర్మించుకున్న అరుదైన ప్రజా నాయకుడు నర్రా రాఘవరెడ్డి. ప్రజల మధ్య జీవించి, ప్రజలతోనే ఎదిగి, ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన నాయకత్వానికి ఆయన జీవితం ఓ ప్రమాణం.



పదవులు కాదు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించడమే నిజమైన నాయకత్వ లక్షణమని నిరూపించిన మార్క్సిస్టు యోధుడు నర్రా. తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో నిజాయితీ ప్రతీకగా నిలిచిన మార్గనిర్దేశకుడు తన జీవితాన్ని సమాజానికి అంకితం చేశారు. శత్రువుని ఎరుగని స్వభావం, విలువలపై కచ్చితమైన నిబద్ధత, ప్రజాస్వామ్య పరిరక్షణలో చూపిన ధైర్యం ఆయనను ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిపాయి.

ప్రజల కోసం సర్వస్వం త్యాగం చేసిన రాజకీయ మహర్షి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో దాదాపు ఆరు దశాబ్దాల పాటు తన జీవితాన్ని జనం కోసం అర్పించుకున్న నాయకుడు నర్రా రాఘవరెడ్డి. పార్టీ నిర్మాణం కోసం రాత్రింబవళ్లు కాలినడకన ఊర్లు తిరిగారు. జనం గుండె చప్పుళ్లను ప్రజా పదంతో లయబద్ధం చేసిన ప్రజా కళాకారుడు. ఆయన ఆడిన, మాట్లాడిన ప్రతి మాట కష్టజీవుల బాధలకు బాట చూపేది. ప్రజలు లేకుండా ఉద్యమం విజయవంతం కాదని నమ్మిన వ్యక్తి. ఇలాంటి బోధవృక్షం జిల్లాకు ఒకటి ఉంటే ఒక తరానికి నీడనిస్తుంది, మరో తరానికి బాట చూపుతుంది.

1924లో నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో నర్రా కనకమ్మ-రాంరెడ్డి దంపతులకు జన్మించారు. పుట్టిన పదకొండో రోజుకే తల్లి కనకమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. చిన్నతనంలోనే తల్లిదండ్రుల ముద్దుమురిపాలకు దూరమయ్యాడు. పెద్దనాన్న వెంకటరాంరెడ్డి, అతని సోదరి కన్నమ్మ ఆలనపాలన చూసి పెద్దవాడిని చేశారు. పెద్దబాల శిక్ష చదివాక నర్రా చిట్యాలోని ఓ పాఠశాలలో నాలుగో తరగతిలో చేరారు. కుటుంబ పరిస్థితులు విషమించడంతో చదువు మధ్యలోనే ఆగిపోయింది.

చదువు ఎక్కువగా లేకపోయినా జ్ఞానాసక్తి తగ్గలేదు. ప్రతిరోజూ మూడు పత్రికలు చదివించుకుని వినే అలవాటు ఆయనకు ఉండేది. సమాజంలో జరుగుతున్న పరిణామాలను శ్రద్ధగా విని విశ్లేషించేవారు. సాధారణ జీవనశైలిని ఇష్టపడే ఆయన అభివృద్ధి కూరగాయలను, చాపలను ఎంతో ఇష్టపడేవారు. నిరాడంబర జీవితం ఆయన వ్యక్తిత్వానికి ప్రతిబింబం.

వట్టిమర్తిలో ఉపాధి అవకాశాలు లేక బొంబాయి బాట పట్టారు. తొలి రోజుల్లో హోటల్ కార్మికుడిగా పనిచేశారు. తరువాత సూరత్ వెళ్లి గైక్వాడ్ జౌళి మిల్లులో 13 రూపాయల వేతనానికి చేరారు. జి.ఎం. ఖాన్ సహకారంతో కార్మిక నేతగా ఎదిగారు. కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా ఏర్పడిన "లాల్ బావుటా" సంఘంలో సభ్యత్వం తీసుకుని 12 గంటల పని విధానానికి వ్యతిరేకంగా కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నడిపారు. ఎనిమిది సంవత్సరాలు బొంబాయిలో గడిపిన నర్రా తండ్రి రాంరెడ్డి ఆరోగ్యం బాగోలేదని ఉత్తరం రావడంతో వట్టిమర్తికి తిరిగి వచ్చారు. లాల్ బావుటా సంఘంలో పనిచేసిన రోజుల్లోనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అలవర్చుకున్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి ద్వారా కళాకారుడిగా ప్రజల్లోకి ప్రవేశించారు. పల్లెల్లో పర్యటిస్తూ బాధలను పాటల రూపంలో చైతన్యంగా మార్చారు. కళను రాజకీయ ఆయుధంగా వినియోగించిన ప్రత్యేక శైలి ఆయనది. 1945లో కమ్యూనిస్టు పార్టీలో చేరి సామాజిక మార్పు లక్ష్యంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ విభజన తర్వాత సీపీఎంలో కొనసాగారు. పార్టీ విస్తరణ నిర్మాణానికి కృషి చేశారు. ప్రతి పోరాటంలో సతీమణి తారకమ్మ మద్దతు అందించారు.

వట్టిమర్తి, నకిరేకల్ తాలూకా స్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహించారు. నల్గొండ సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ ప్రస్థానంలో 50 ఏళ్ల పాటు జనం కోసం అలుపెరగని పోరాటాలు చేశారు. నీతికి నిలువెత్తు సాక్షిగా ఆదర్శ కమ్యూనిస్టు ప్రజానాయ'కందిలి' కథలు ..తెలంగాణ చీకటి జీవనం పై వెలుగు

1959లో శివనేనిగూడెం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అదే కాలంలో నార్కట్‌పల్లి నాన్‌బ్లాక్ జిల్లా పరిషత్ సభ్యుడిగా జడ్పిలో ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాత్రిపూట పాఠశాలలు ఏర్పాటు చేసి ప్రజలకు అక్షరజ్ఞానం నేర్పించారు. అనంతరం 1960లో సమితి ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారు. ప్రజలకు చేరువైన పాలన అందించారు.

ఉద్యమాల కారణంగా పలు సందర్భాల్లో అరెస్టులు ఎదురయ్యాయి. 1964లో నిర్బంధం అనుభవించారు. అత్యవసర పరిస్థితుల్లో మరోసారి జైలు జీవితం గడిపారు. కష్టసమయాల్లో సిద్ధాంత నిబద్ధత తగ్గలేదు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ధైర్యంగా నిలిచారు. పోరాట మార్గం ఆయనకు జీవన విధానంగా మారింది.



1967లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా తొలి సారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తొలి ఎన్నికల్లో కేవలం 300 రూపాయల ఖర్చుతో మోటార్‌సైకిల్‌పై ప్రచారం చేశారు. "నోరే నా పెట్టుబడి... ప్రజల ప్రేమే నా సంపద" అనే నినాదం ఆయన విధానాన్ని ప్రతిబింబించింది.

1972లో ఓటమి ఎదురైనా ప్రజల్లోనే కొనసాగారు. 1978, 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. మొత్తం ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా నిలిచారు. చట్టసభల్లో ప్రజల గొంతుకయ్యారు. కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలను ఎండగట్టుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండారు. శాసనసభలో పార్టీ వాణిని బలంగా వినిపించారు.

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సాధన కోసం కృషి చేశారు. గీత కార్మికుల సమస్యలపై సంఘటిత పోరాటాలు నిర్వహించారు. గ్రామ సేవకులను సమీకరించి సంఘం ఏర్పాటు చేసి హక్కుల సాధనకు కృషి చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయం నిర్మాణంతో పాటు నకిరేకల్ కార్యాలయం నిర్మాణానికి ప్రత్యేకంగా కృషి చేశారు.


నకిరేకల్ నియోజకవర్గంలోని 50 గ్రామాలకు, నల్గొండ-మునుగోడు ప్రాంతంలోని 15 గ్రామాలకు విద్యుద్దీకరణకు కృషి చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కోసం పోరాటాలు నిర్వహించారు. ఫ్లోరైడ్ నివారణకు కృషి చేశారు. రోడ్లు, తాగునీరు, విద్య కోసం ఉద్యమాలు చేశారు. బంజరు భూములు, మిగులు భూములు గుర్తించి పేదలకు పంపిణీ చేయించారు. బీబీనగర్-నడికుడి రైలు మార్గం కోసం కృషి చేశారు.

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీపీఎం శాసనసభ పక్ష నాయకుడిగా ఎంపికయ్యారు. కంటి చికిత్స కోసం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవ పున్నయ్య సూచనతో రష్యాకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఎన్టీఆర్‌తో మంచి సంబంధాలు కొనసాగించారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి స్థలం కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఆంగ్లంలో వెలువడే ప్రభుత్వ ఉత్తర్వులు సామాన్యులకు అర్థం కావని ప్రశ్నిస్తూ తెలుగులో ఉత్తర్వులు జారీ చేయాలని కృషి చేశారు. ప్రజాస్వామ్యం ప్రజల భాషలో ఉండాలని నమ్మారు.

ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అవినీతి మరక అంటలేదు. ప్రభుత్వ ఇంటి స్థలాన్ని తిరస్కరించారు. అధికార సౌకర్యాలు వినియోగించుకోలేదు. వ్యక్తిగత ఆస్తులు కూడబెట్టలేదు. ప్రజలే తన సంపదగా భావించారు. అజాతశత్రువు అనే గుర్తింపు పొందారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, సర్పంచ్‌గా, సమితి అధ్యక్షుడిగా, జెడ్పీ సభ్యుడిగా సుదీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా పనిచేసిన నర్రా రాఘవరెడ్డి అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించింది. ఇప్పటి రాజకీయాల్లో ధనబలం, అధికార ప్రదర్శన ఆధిపత్యం పెరిగింది. పార్టీ మార్పులు సాధారణమయ్యాయి. ఓటర్లను ప్రలోభపెట్టే ధోరణి విస్తరించింది. పదవిని సంపాదన మార్గంగా వినియోగించే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఆయన జీవితం స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపుతుంది. జనబలం అసలైన బలం అని నిరూపించారు. ప్రజల మధ్యే తిరగడం నాయకత్వానికి మూలమని చాటారు.

పారదర్శకత ప్రజా విశ్వాసాన్ని పెంచుతుందని వివరించారు.



నిబద్ధతతో సేవ చేస్తే గౌరవం స్వయంగా వస్తుందని చూపించారు. ప్రజాప్రతినిధి అంటే అధికార ప్రదర్శన కాదు సేవ భావం కావాలి. పదవి అంటే బాధ్యత అనే ఆలోచన ఉండాలి. నైతిక విలువలు రాజకీయాలకు ప్రాణం కావాలి. ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఉండాలి. ఈ మార్గాన్ని చూపిన ఆదర్శ నాయకుడు నర్రా రాఘవరెడ్డి.

వయోభారంతో ప్రజాజీవితానికి దూరమైన నర్రా రాఘవరెడ్డి 2015 ఏప్రిల్ 9న తన 92వ ఏట కన్నుమూశారు. ఆయన చనిపోయి పదకొండు సంవత్సరాలు అవుతున్న నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రజల కోసం బతికినవాడు ఎల్లకాలం జీవిస్తాడనే సత్యానికి ఆయన జీవితం నిలువెత్తు నిదర్శనం. ఇలాంటి వ్యక్తిత్వం రాష్ట్ర రాజకీయాల్లో చాలా అరుదు.

చదువుపరిమితమైనప్పటికీ సమాజాన్ని చదివిన అనుభవం ఆయనకు ప్రజల జీవన సత్యాలను నేర్పింది. ప్రజా పాలన అంటే ప్రజల నాడి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం అని ఆచరణలో చూపించారు.

ప్రతి అంశాన్ని ప్రజలకు చేరవేసే విధానాన్ని పాటించారు. ప్రజల ఆస్తి తన ఆస్తి అనే భావనతో పనిచేశారు. నాయకుడు అంటే ఎలా ఉండాలనే ప్రమాణాన్ని తన జీవితంతో నిరూపించారు.

ఆయనకు సాధ్యమైన విలువల రాజకీయాలు నేటి పరిస్థితుల్లో ఎందుకు సాధ్యం కాలేదనే ప్రశ్నను ముందుంచిన ప్రస్థానం. నీతి, నిజాయితీ, నిరాడంబరత కలిసినప్పుడు ప్రజా నాయకత్వం ఎలా ఉండాలో చూపించిన శాశ్వత ఆదర్శం. ఇలాంటి మహోన్నతుడు చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

నకిరేకల్ నియోజకవర్గానికి నర్రా పేరు పెట్టాలని, విగ్రహం ఏర్పాటు చేయాలని, స్మృతి వనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. నీతి, నిజాయితీ, నిరాడంబరత కలిసినప్పుడు ప్రజా నాయకత్వం ఎలా ఉండాలో చూపించిన శాశ్వత ఆదర్శం...


జనం నాడి పట్టిన జన హృదయ నేత
నర్రా రాఘవరెడ్డికి. జోహార్లు



గడగోజు రవీంద్ర చారి
9848772232

# 'కందిలి' కథలు ..తెలంగాణ చీకటి జీవనం పై వెలుగు

తెలంగాణ కథాసాహిత్యం ఎప్పుడూ నేలమీద నిలబడి మాట్లాడింది. రాజ్యాంగ పీఠాలపై నుంచి కాదు. పల్లెల పొలిమేరల నుంచి, అడవుల అంచుల నుంచి, గిరిజన గూడేల నుంచి, బస్తీల గుండెల్లో నుంచి పలికింది. ఆ సంప్రదాయానికి ఇటీవలి కాలంలో వచ్చిన బలమైన కొనసాగింపే 'కందిలి'. ఖమ్మం స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో, డాక్టర్ ధరణికోట రమేష్ కుమార్ సంపాదకత్వంలో వెలువడిన ఈ తెలంగాణ కథల సంకలనం, ఒక పుస్తకంగా కాదు ఒక సామాజిక ప్రకటనగా మన ముందుకు వస్తుంది.





'కందిలి' అనే పదమే ఒక రూపకం. చీకటి రాత్రిలో పెద్ద వెలుగులు కనిపించవు. చిన్న లాంతరు వెలుగే దారి చూపుతుంది. ఈ సంకలనంలోని 11 కథలు కూడా అంతే. అవి గర్జించే నినాదాలు కావు. నెమ్మదిగా మన హృదయాన్ని తాకి, మన ఆలోచనల చీకటిని చీల్చే వెలుగులు. ఇవి తెలంగాణ జీవనంలోని మౌన వేదనలను, పక్కకు నెట్టేసిన మనుషుల కథలను, వ్యవస్థల క్రూరత్వాన్ని మృదువుగానే కానీ బలంగా వెలికి తీస్తాయి.

ఈ కథల నేపథ్యం నేల, నీరు, అడవి, మనిషి. అన్ని కథలూ 'కందిలి' కథలన్నీ ఒకే దారిలో నడవవు. కానీ అవన్నీ ఒకే నేలపై పుడతాయి. ఒకే నేలను తడతాయి. ఆ నేల పేరు తెలంగాణ.

ఈ కథల్లో భూమి ఉంది, దోచుకోబడుతున్న భూమి.
నీరు ఉంది రాజకీయ లెక్కల్లో చిక్కుకున్న వాగులు, చెరువుల నీరు.
అడవి ఉంది. కార్పొరేట్ లాభాల కోసం ఖాళీ చేయబడుతున్న అడవి .
మతం ఉంది ప్రేమను, మనిషిని చీల్చే ఆయుధంగా మారిన మతం.
మహిళ ఉంది, తల్లిగా, భార్యగా, కూతురిగా, చివరకు మనిషిగా తన ఉనికిని వెతుక్కుంటూ. ఈ కథల ప్రత్యేకత ఏమిటంటే, రచయితలు సమస్యలను కేవలం చూపించరు. వాటి వేర్లను తవ్వుతారు. సంఘటన వెనుక ఉన్న సామాజిక నిర్మాణాన్ని, అధికార సంబంధాలను, మనుషుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తారు.

ఈ సంకలనం కోసం తెలంగాణలోని పది జిల్లాల నుంచి ఒక్కొక్క రచయితను ఎంపిక చేయడం ఒక సాహిత్యపరమైన రాజకీయ నిర్ణయం. ఇది ఒక వ్యక్తి దృష్టికోణం కాదు. ఇది ఒక ప్రాంతపు సామూహిక స్వరం. అందరూ లబ్ధప్రతిష్ఠులే అయినా, వారి రచనల్లో అహంకారం లేదు. కథలు నేలమీద నడుస్తాయి. పాత్రలు మనకు తెలిసిన వాళ్లే.

**'మొదటి గంట' – పెద్దింటి అశోక్ కుమార్**

పాఠశాల అంటే భవిష్యత్తుకు బాట వేసే స్థలం. కానీ ఆ పాఠశాలే మత మౌఢ్యానికి, పెద్దల నిర్లక్ష్యానికి బలి అయితే? వినాయకచవితి అనే మతపండుగ నేపథ్యంలో ఒక ప్రతిభావంతుడైన విద్యార్థి మద్యం, మాదకద్రవ్యాల బానిసగా మారడం,ఇది వ్యక్తిగత పతనం కాదు సమాజం చేసిన నేరం.ఈ కథ ప్రశ్నిస్తుంది. పిల్లల్ని కాపాడాల్సిన పెద్దలే వారి భవిష్యత్తును తాగేస్తే బాధ్యత ఎవరిది?

***'అమ్మనీడ చీకటి' – డా. ఎ.ఎం. అయోధ్యారెడ్డి***

అమ్మ నీడ సాధారణంగా భద్రతకు చిహ్నం. కానీ ఇక్కడ అదే నీడ చీకటిగా మారుతుంది.
యుక్తవయసులో చేసిన ఒక తప్పు, సమాజం విధించిన శిక్ష, చివరకు పడుపు వృత్తిలోకి నెట్టివేయబడిన జీవితం - ఇది ఒక మహిళ కథ కాదు. ఇది పురుషాధిపత్య సమాజం సృష్టించిన గాథ.
తల్లి తన కుమార్తెను అదే చీకటికి బలిచేయాల్సి వచ్చే దశ - ఈ కథ చదువుతుంటే మనసు మౌనంగా విలపిస్తుంది.

***'కగార్' – పి. చంద్.***

అడవి అంటే ప్రకృతి కాదు అది గిరిజనుల జీవితం.
కార్పొరేట్ శక్తులు, రాజకీయ మద్దతుతో అడవిని ఖాళీ చేసి, గిరిజనులను వలస కూలీలుగా మార్చడం ఇది అభివృద్ధి కాదు, ఇది ఆధునిక కాలపు వలస పాలన.ఈ కథలో అడవి ఏడుస్తుంది . మనం వినకపోవడమే అసలు విషాదం.

'కృష్ణనింబః' - ధరణికోట రమేష్ కుమార్

ఒక వాగు తన కథ తానే చెప్పుకుంటుంది. ఇది కవిత్వం కాదు, ఇది రాజకీయ వ్యంగ్యం. నీటి రాజకీయాలు, రైతుల మోసం, వాగుల్ని ఓట్ల కోసం వాడుకునే నేతలు, ఈ కథలో నీరు కన్నీరు కారుస్తుంది.
ప్రకృతి కూడా మనుషుల చేతిలో బాధితురాలే అన్న సత్యాన్ని ఈ కథ బలంగా చెబుతుంది.

'నయా ఆస్మాన్' - స్కైబాబా

***ప్రేమకు మతం అవసరమా?***

ఈ కథలో ప్రేమ కొత్త ఆకాశాన్ని కోరుకుంటుంది. మత చట్రాలు ప్రేమను ఎలా బంధిస్తాయో, మనుషుల్ని ఎలా విభజిస్తాయో ప్రశ్నిస్తుంది.ఇది తిరుగుబాటు కథ కాదు. ఇది విముక్తి కల.

***'అత్తరు' – శ్రీఊహ***

భార్య పరిమళం అది సువాసన కాదు, అది అనుబంధం.
భౌతిక ఆకర్షణల నుంచి భావోద్వేగ అవగాహన వైపు ప్రయాణించే భర్త.
ఈ కథలో పెద్ద సంఘర్షణలు లేవు, కానీ లోతైన మానవత్వం ఉంది.

***'భాగీ యూ ఆర్ గ్రేట్' – స్వాతి శ్రీపాద***

రెండుసార్లు నిర్లక్ష్యానికి గురైన మహిళ, మూడోసారి తనను తానే ఎంచుకోవడం - ఇది ఆధునిక మహిళా కథ. బాధితురాలిగా కాదు, ఆత్మవిశ్వాసంతో నిలబడిన వ్యక్తిగా ఆమె ఎదుగుదల ఈ కథ బలం.

***'ఆఖరిమనుషులు' – ఉదయమిత్ర***

"మాది అతరించిపోతున్న జాతి... మమ్మల్ని మ్యూజియంలో చూస్తారు" ఈ ఒక్క వాక్యం తెలంగాణ గిరిజనుల భవిష్యత్తుపై శాసనంలా నిలుస్తుంది. చెంచు జాతి మహిళ గాథ - ఇది కథ కాదు. ఇది చరిత్రకు ఇచ్చిన హెచ్చరిక.

***'భ్రమాన్విత పరిమళం' – వంశీకృష్ణ***

మత సామరస్యం అనే మాట ఒక భ్రమ మాత్రమేనని ఈ కథ నిర్దాక్షిణ్యంగా చెబుతుంది.మతమౌఢ్యం నుంచి పుట్టే హింసను ప్రశ్నిస్తూ, మనిషి అసలు పరిమళం మానవత్వమే అని గుర్తు చేస్తుంది.

***'ఆపరేషన్ ఖండాల' – వసంతరావు దేశ్‌పాండే***

గోండు యువకుడి చైతన్యం ఈ కథకు ప్రాణం. కార్పొరేట్ ,అధికార శక్తుల కుట్రలకు ఎదురుగా నిలబడే ధైర్యం, ఇది ప్రతిఘటన సాహిత్యం.

'ఉనికి' - కొట్టం రామకృష్ణారెడ్డి
వృద్ధాప్యంలో తన ఉనికిని తానే తెలుసుకునే మనిషి ఈ కథలో పెద్ద నినాదాలు లేవు.
కానీ జీవితం చివరి మలుపులో మనిషి తనను తాను ఎదుర్కోవాల్సిన క్షణాన్ని అత్యంత సున్నితంగా ఆవిష్కరిస్తుంది.

'కందిలి' కేవలం కథల సంకలనం కాదు. ఇది తెలంగాణ సమాజాన్ని నిర్వచించిన సామాజిక నిఘంటువు.
ఈ పుస్తకం చదివిన తర్వాత మనసులో మిగిలేది ఒక చిన్న వెలుగు. ఆ వెలుగు చీకటిని ప్రశ్నిస్తుంది, మనల్ని ఆలోచింపజేస్తుంది.
తెలంగాణ జనజీవనంలోని నిజాలను, వేదనలను, పోరాటాలను అర్థం చేసుకోవాలంటే 'కందిలి' తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం.
ఇది చదివిన తర్వాత మనం మునుపటిలా ఉండలేం - అదే ఈ సంకలనపు విజయం.

***– సాధన.తేరాల, ఖమ్మం***

***Vejella Venkata Ramana కందిలి తెలంగాణ కథల సంకలనం***
***వెల : Rs. 150/-***
***ప్రతులకి:***
***Dr. ధరణికోట రమేష్ కుమార్, 9866631720;***
***నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్***
***తెలుగు బుక్స్. ఇన్; 9247471362***
***తెలంగాణ పబ్లికేషన్స్, హైదరాబాద్***
***8639972160***
***లోగిలి బుక్స్, గుంటూరు***
***logili .com***
***9550146514***

# పద్మశ్రీ నోటి నుండి విషపు కూతలు

***పసిపిల్లల పౌష్టికాహారం పై ఏంటీ మాటలు***
***బాలల హక్కులకు విఘాతం కల్పించే గరికపాటి వ్యాఖ్యలు***
***సుమోటోగా కేసు నమోదు చేయాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) డిమాండ్***





పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు గుడ్డు అందించడంపై పద్మశ్రీ గ్రహీత గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. "గుడ్డా గాడిద గుడ్డా.. అన్నం తినేవాడికి కోడిగుడ్డు ఎందుకు? కోడిగుడ్డు కోసం వస్తావా?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు విద్యార్థులను అవమానించేలా ఉన్నాయని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్) మండిపడింది.సంఘం అభిప్రాయం ప్రకారం, ఈ వ్యాఖ్యలు చిన్నారుల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండటమే కాకుండా, వారి మౌలిక హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయి. అందువల్ల గరికపాటిపై సుమోటోగా కేసు నమోదు చేసి, బాలల హక్కుల పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని కోరింది.మధ్యాహ్న భోజన పథకం కేవలం పేద పిల్లల కోసం మాత్రమే కాదని, విద్యార్థుల హాజరు పెంచడం, డ్రాపౌట్స్ తగ్గించడం, బాల కార్మికత్వాన్ని నిరోధించడం మరియు ఎదిగే పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందించడం దీని ముఖ్య ఉద్దేశ్యమని సంఘం స్పష్టం చేసింది. ఈ పథకం ద్వారా పాఠశాలల్లో చేరికలు పెరగడమే కాకుండా, సమానత్వ భావన కూడా పెంపొందుతుందని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు), ఆర్టికల్ 21A (విద్య హక్కు), ఆర్టికల్ 47 (పౌష్టికాహారం పెంపు రాష్ట్ర బాధ్యత) వంటి నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం పిల్లల హక్కుగా గుర్తించబడిందని వివరించారు. అలాగే ఆర్టికల్ 24 ప్రకారం బాల కార్మికత్వాన్ని నిషేధించడం ద్వారా పిల్లల ఆరోగ్యం, విద్య, భద్రతను కాపాడే బాధ్యత రాష్ట్రాలపై ఉందని గుర్తుచేశారు. ఈ పథకం చరిత్రను కూడా సంఘం ప్రస్తావించింది. బ్రిటిష్ కాలంలోనే 1920లో మద్రాస్ ప్రెసిడెన్సీలో ప్రారంభమైన ఈ ఆలోచనను, స్వతంత్ర భారతదేశంలో తమిళనాడులో మాజీ ముఖ్యమంత్రి కె. కామరాజ్ 1960 దశకంలో విస్తృతంగా అమలు చేశారు. తరువాత 2001లో సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం తప్పనిసరి అయింది. పిల్లల కోసం కనీసంగా 300 క్యాలరీలు, 812 గ్రాముల ప్రోటీన్ కలిగిన వండిన భోజనం అందించాలని కోర్టు స్పష్టం చేసింది. పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు గుడ్డు వంటి ప్రోటీన్ ఆహారాలను పథకంలో చేర్చినట్లు సంఘం తెలిపింది. అలాంటి కీలకమైన ఆహారంపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం సరైంది కాదని విమర్శించింది. పిల్లలకు ఆహారం అందించడం కేవలం సంక్షేమ కార్యక్రమం కాదు, అది వారి హక్కు అని సుప్రీంకోర్టు కూడా పేర్కొన్నదని గుర్తుచేసింది.ఇంకా, గరికపాటి చేసిన "పిల్లలకు అన్నీ ఇస్తే చదువుతారా?" వంటి వ్యాఖ్యలు విద్యార్థుల పట్ల అవమానకరంగా ఉన్నాయని, ఇది బాలలపై మానసిక వేధింపులకే సమానమని సంఘం అభిప్రాయపడింది.

పాఠశాలల్లో పౌష్టికాహారం లేకపోతే పిల్లలు తిరిగి కూలి పనుల వైపు వెళ్లే ప్రమాదం ఉందని, ఇది సమాజానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుందని హెచ్చరించింది. అందుకే మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం కూడా అందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కొంతమంది విద్యార్థులు ఆకలితో స్కూళ్లలోనే అస్వస్థతకు గురవుతున్న ఘటనలను కూడా ఉదాహరణగా చెప్పింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ఖర్చుగా కాకుండా బాధ్యతగా అమలు చేస్తున్నాయని, పాఠశాలల్లో చేరికలు పెంచడం, సమాన విద్యావకాశాలు కల్పించడం దీని ప్రధాన లక్ష్యమని సంఘం తెలిపింది.

ఈ నేపథ్యంలో, గరికపాటి నరసింహారావు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, ప్రజలకు వివరణ ఇవ్వాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పిల్లల గౌరవం, హక్కులను కించపరిచే వ్యాఖ్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.



***- ఇంజమూరి రఘునందన్***
***(సెల్: 9866102962)***
***రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) .***

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 29.03.2026
www.mudranews.in | @mudranews
5
దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

## ఐజేయూ: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ

పత్రికా రంగంలో పనిచేసే వారి ఉద్యోగ భద్రత, గౌరవం కోసం పోరాడుతుంది. వేతనాలు, పనివేళలు వంటి అంశాలపై కృషి చేస్తుంది.

IJU Indian Journalists Union

# పార్టీలకు అతీతంగా అభివృద్ధి

**పాలమూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్ ను పార్టీ లకు అతీతంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం పాలమూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరముందన్నారు. కార్పొరేషన్‌గా మారిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కావడంతో దీన్ని సమర్థవంతంగా అమలు చేసి నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. గతంలో బడ్జెట్‌లో ఉన్న లోటును దశలవారీగా భర్తీ చేయడానికి కృషి చేయాలని, నిధులను సమర్థవంతంగా వినియోగిస్తేనే మహబూబ్ నగర్‌ను రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చన్నారు. రానున్న ఐదేళ్ల పాటు ఎన్నుకున్న ప్రజలకు సేవ చేసే అవకాశం మీకు లభించిందని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలన్నారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని పార్టీలకు అతీతంగా కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే నాయకత్వంలో నగరం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు మేయర్ గుమాల మమత బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

**ప్రోటోకాల్ రగడ :**

కౌన్సిల్ సమావేశానికి ముందు వేదికపై ఎక్కువ కుర్చీలు ఉండడం బీఆర్ఎస్ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మేయర్ ఒక్కరే డయాస్ పై ఉండాలని ఇంకా ఎవ్వరూ ఉండవద్దని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు స్పందించలేదు. డయాస్ పై మేయర్ తో పాటు ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, కమిషనర్, అసిస్టెంట్ కలెక్టర్ కూర్చున్నారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు గొడవకు దిగారు. మున్సిపల్ చట్టంలో ప్రోటోకాల్ లో వీరందరూ వేదికపై కూర్చోవచ్చని కమిషనర్ చెప్పినా వారు వినలేదు. కొద్దిసేపు రగడ జరిగింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరిగింది.

## ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్త వహించాలి

**ముద్ర, నారాయణపేట :** బావాజీ జాతర జరిగే ప్రాంతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పరిధి అని, ప్రోటోకాల్ విషయంలో చాలా జాగ్రత్త వహించాలని, ఎవరు పడితే వారిని అనుమతించవద్దని పోలీసులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డి పల్లి గ్రామంలోని బావోజీ ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణింద్ర రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తిమ్మారెడ్డి పల్లి లో వచ్చే నెల ఏప్రిల్ 1 నుంచి 4 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) జాతర బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

## వంట గ్యాస్ కొరత లేదు

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ వినియోగదారులు అవసరం లేకున్నా బుకింగ్ చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. బుకింగ్ చేసిన తర్వాత, వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు రామేశ్వరి దేవి, కేషు రామ్, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, పెట్రోల్ బంకుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళాలి

**- కలెక్టర్ ప్రతీక్ జైన్**



**ముద్ర, నారాయణపేట:** కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళాలని, విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య చేధన కు నిరంతర సాధన చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఆయన మద్దూరు మండలంలోని పెదిరి పాడ్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు, చదువు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థినిలు కలెక్టర్ కు తెలిపారు. ప్రతీ వారం సినిమా చూస్తున్నారా అని ఆరా తీశారు. ఇకపై ప్రతీ శనివారం విద్యార్థినులకు పాఠశాలలో మంచి సందేశాత్మక సినిమాలను చూపించాలని ఎస్. వో కు ఆయన సూచించారు. తరగతి గదిలోని విద్యార్థినుల జీవితాశయం, లక్ష్యం గురించి ఒక్కరిని అడగడంతో కొందరు ఐ ఏ ఎస్, ఐ పీ ఎస్, మరికొందరు డాక్టర్ అవుతామని తెలపగా ఆర్కిటెక్, సైంటిస్ట్ లు ఎవరూ కారా అని ప్రశ్నించారు. కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళాలని సూచించారు. వారి వారి పుస్తకాల్లో విద్యార్థినుల పేర్లు రాయించారు. తర్వాత పేర్ల ముందు వారు ఏం కావాలని అనుకుంటున్నారో ఆ డీజిగ్నేషన్ను రాయించి, రోజూ పుస్తకం తెరిచి చూస్తే తాము భవిష్యత్తులో ఆ డీజిగ్ నేషన్ చేరుకునేందుకు కష్టపడి చదవాలని తెలిపారు. కేవలం కలెక్టర్, డాక్టర్, ఇంజినీర్ అవుతాం అనుకుంటే సరిపోదని, ఆ స్థాయిని చేరుకునేందుకు ప్రణాళిక ప్రకారం చదువు కోవాలన్నారు.

# రాజీ మార్గమే.. రాజమార్గం





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** "రాజీ మార్గమే రాజమార్గం" అని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డి. రమాకాంత్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం పొందడంతో పాటు, అప్పీల్‌కు అవకాశం లేకుండా తుది తీర్పు లభిస్తుందని చెప్పారు. దీనివల్ల సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయని తెలిపారు. ఇరువర్గాలు సఖ్యతతో జీవించేందుకు ఇది మంచి వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి నసీం సుల్తానా మాట్లాడుతూ పగలు, ప్రతీకారాలు విడిచిపెట్టి రాజీకి రావాలని సూచించారు. సంవత్సరాల పాటు కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా త్వరిత పరిష్కారం పొందవచ్చని వివరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,688 కేసులు పరిష్కారం పొందినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంత్ రావు సహా పలువురు న్యాయవాదులు, కక్షిదారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

**మెగా లోక్ అదాలత్ విజయవంతం**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** మెగా లోక్ అదాలత్ కార్యక్రమం సందర్భంగా జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు గౌరవ న్యాయమూర్తులు శ్రావణ్ కుమార్, షాంకోషి లను టెన్త్ బెటాలియన్ గెస్ట్ హౌస్ వద్ద ఎస్పీ టి. శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దే బాధ్యత మీదే

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దే దిశగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. మద్గుల్ చిట్టంపల్లి డిపిఆర్సి భవనంలో సర్పంచుల కు శిక్షణ ముగింపు కార్యక్రమా నికి విచ్చేసిన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అతి కీలకమైనదన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ గ్రామపంచాయతీల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇంటి పన్నులు, వ్యాపార దుకాణాల పన్నులతో పాటు ఇతర ఆదాయ వనరులను సమకూర్చుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామ ఆర్థిక వనరులను పెంపొందించుకున్నట్లయితే సీసీ రోడ్లు, పారిశుద్ధ్య పనులు, నీటి సమస్య లేకుండా చేయవచ్చునని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే మోటార్లను మంజూరు చేసి నీటి సమస్య రాకుండా చూస్తామని అదేవిధంగా మిషన్ భగీరథ పనుల నిమిత్తం రవాణా సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సర్పంచులకు శిక్షణ ధృవీకరణ పత్రం అందించారు. జెడ్పి సీఈవో సుధీర్, డిపిఓ జయసుధ, మాస్టర్ ట్రైనీలు (ఎంపీడీవోలు) వినయ్ కుమార్, రాములు పాల్గొన్నారు.

## పరీక్షలను సజావుగా నిర్వహించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సదుపాయంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, చీఫ్ సూపరింటెండెంట్ రాజు ఉన్నారు.

**కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నాం**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు. శనివారం కల్వకుర్తి, తాడూర్ మండలాల్లోని కల్వకుర్తి జేపీ నగర్ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తాడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ అబార్షన్లపై కఠిన చర్యలు

**కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో గర్భిణులు, శిశువుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శనివారం కలెక్టరేట్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కీలక సూచనలు చేశారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన నిఘా ఉంచాలని, ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లయిలతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 1000 మంది బాలురకు కేవలం 894 మంది బాలికలే ఉన్నారని పేర్కొంటూ, ఈ అసమానత కొనసాగితే భవిష్యత్తులో తీవ్రమైన ప్రభావాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ తారా సింగ్, భీమ్లా నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రఫీక్ పాల్గొన్నారు.



**ఆధునిక పద్ధతులతో సాగు చేయాలి**

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. శనివారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, పంట ప్రదర్శన, అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పాత పద్ధతులకు పరిమితం కాకుండా ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో రైతులు ఎక్కువగా వరి సాగుపైనే ఆధారపడుతున్నారని, దీనివల్ల ఆశించిన ఆదాయం రాకపోవచ్చని పేర్కొన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ సుహాసిని, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శైల, డాక్టర్ ఆదిశంకర్, జిల్లా హార్టికల్చర్ అధికారి వెంకటేశం, ఏవో పూర్ణచంద్రారెడ్డి, అధికారులు జగన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**ఏప్రిల్ 2న గ్రామ సభలు**

ఏప్రిల్ 2న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి పాల్గన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సౌకర్యవం తంగా ఉండేలా తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని డీపీవో శ్రీరాములను ఆదేశించారు. డిఆర్డిఏ పీడీ చిన్న ఓబులేష్, డీఈఓ రమేష్ కుమార్, డిటిఓ చిన్న బాలు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నీ ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ మండలం ఆవంచ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. చర్లకోల శ్వేత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా యువతలో ఉత్సాహం, క్రమశిక్షణ పెరుగుతాయ న్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు.

## లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌కు సీఎంకు ఆహ్వానం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** మార్చి 28, 29 తేదీలలో నిర్వహించనున్న ఫస్ట్ ఎడిషన్ "తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ – 2026" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ని నిర్వాహకులు ఆహ్వానించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అండ్ ఆర్గనైజింగ్ కో–కన్వీనర్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్గనైజింగ్ కన్వీనర్ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే, ఆర్గనైజింగ్ మెంబర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, స్పోర్ట్స్ వీసీ, ఎండీ సోని బాల దేవి కలిసి ముఖ్యమంత్రిని కలిసి కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమం లక్ష్యాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాముఖ్యతపై నిర్వాహకులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాప్రతినిధుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం, సాంస్కృతిక ఐక్యతను బలోపేతం చేయడం ఈ మీట్ ప్రధాన ఉద్దేశ్యంగా తెలిపారు.

## వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

**ముద్ర, కూకట్‌పల్లి:** నియోజకవర్గంలో శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. కూకట్పల్లిలోని ప్రధాన రామాలయంతో పాటు దీప్తిశ్రీ నగర్‌లోని ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, భక్తజన సందోహం నడుమ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కిక్కిరిసిన ఆంజన్న ఆలయం

**ముద్ర, గద్వాల:** ధరూర్ మండలంలోని శ్రీపెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం వండి ఆంజనేయస్వామికి దాసంగాలు సమర్పించారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## 31 నుంచి బ్రహ్మోత్సవాలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బిజినపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామంలో శ్రీ నందీశ్వర–నందేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 31 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. ఏప్రిల్ 2, 2026 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం ఉత్సవ మూర్తుల వాహన సేవలు, ఏప్రిల్ 1న విశేష పూజలు, మధ్యాహ్నం మహా ప్రసాద వితరణ, సాయంత్రం రథోత్సవం, ఏప్రిల్ 2న ఉదయం స్వామివారి కళ్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరింది.

## గొట్టిముక్కల దేశాల్ జన్మదిన వేడుకలు

**ముద్ర కూకట్‌పల్లి:**

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొట్టిముక్కల దేశాల్ జన్మదిన వేడుకలు శనివారం ఆయన స్వగృహంలో జరిగాయి. ఈ వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## వాహన తనిఖీలు

**ముద్ర, పెబ్బేర్:** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపూర్ చౌరస్తానందు ఎస్సై హిమబిందు ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పకుండా వాడాలని సూచించారు. వాహనానికి తప్పనిసరిగా అన్ని డాక్యుమెంట్స్ ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోలలో, బోనరాలలో ఎక్కించరాదని ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ మధు, శ్రీను, శివాని పాల్గొన్నారు.

## అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు

**ముద్ర, మల్కాజిగిరి:** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం కాప్రా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా కార్యక్రమములో భాగంగా కాప్రా సర్కిల్ లో పర్యటించి, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ టౌన్ ప్లానింగ్ వర్క్స్ ను పరిశీలించారు. అనంతరం కందిగూడ డా చౌరస్తాలో గల పార్కును, ఫుట్బాల్ గ్రౌండ్ను సందర్శించి నిర్మాణంలో ఉన్న పనులను తనిఖీ చేశారు. కుషాయిగూడ డీమార్ట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇంజనీరింగ్ బాక్స్ డ్రైనేజ్ వర్క్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఈఈ రమేష్ బాబు, డిఈ బాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు.

## పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్ కర్నూల్ మండలంలోని కుమ్మెర, కుమ్మెర తాండా, నర్సాయిపల్లి గ్రామాలలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కల్పన తెలిపారు. మొత్తం 134 పశువులకు, 265 గేదెలకు, 23 దూడలకు టీకాలు అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కుమ్మెర గ్రామ సర్పంచ్ కె. తుకారాం రెడ్డి, ఉప సర్పంచ్ కాట్రావత్ రవి, మాజీ ఎంపీటీసీ ఆర్. సంతోష్ రెడ్డి, నర్సాయిపల్లి గ్రామ సర్పంచ్ రాముడు, శరబంద , పశువైద్య సిబ్బంది హాజరయ్యారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

**ముద్ర, గద్వాల:** కేటిదొడ్డి మండల పరిధిలోని ఇర్కిచేడు శివారులో అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక టిప్పర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుండి ఇర్కిచేడు గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఇర్కిచేడు గ్రామ శివారులో తనిఖీలు చేపట్టగా, ఇసుక రవాణకు అనుతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. చంద్రబండకు చెందిన, చంద్రుడుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## వేళాపాళలేని విద్యుత్ కోత

**ముద్ర ప్రతినిధి, నాగర్ కలర్నూల్:** జిల్లా కేంద్రంలోని రాహత్ నగర్ కాలనీ, స్నేహపూరి కాలనీ, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతుల పేరిట ఉదయం 9 గంటల నుంచే సరఫరా నిలిపివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఇండస్ట్రియల్ పార్క్ సందర్శన

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బిజినపల్లి మండలంలోని పాలెం ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ కర్మాగారాన్ని పరిశీలించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 29.03.2026
www.mudranews.in | @mudranews

6 ఉత్తర తెలంగాణ
కరీంనగర్, ఆదిలాబాద్
Karimnagar, Adilabad

ఐజేయూ: ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ
స్వేచ్ఛాయుత మీడి యా ప్రజా స్వామ్యా నికి మూ లస్తంభమని IJU నమ్ముతుంది. ఆ విలు వలను కాపా డటంలో కీలక పాత్ర పోషిస్తుంది.
IJU Indian Journalists Union

# ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి

- మీ ఇండ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోండి
- కోటి ఇండ్లల్లో సోలార్ వ్యవస్థ ఏర్పాటే మోదీ సర్కార్ లక్ష్యం
- సోలార్ ప్యానెల్ పై సబ్సిడీతోపాటు 80 శాతం లోన్ వస్తుంది
- పేదలకు సైతం సోలార్ ను ఏర్పాటు చేసుకునే వీలుంది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




**ముద్ర, కరీంనగర్:**
ప్రజాప్రతినిధులు తమ ఇండ్లపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వార్డు సభ్యులు నుంచి సర్పంచ్‌లు, కౌన్సిలర్లు నుంచి కార్పొరేటర్ల వరకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన "PM సూర్య ఘర్ – ముఫ్త్ బిజిలీ యోజన" పథకం ద్వారా దేశ వ్యాప్తంగా కోటి ఇండ్లపై సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలిపారు. ఈ పథకానికి కేంద్రం రూ.75 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిందన్నారు. ప్రతి ఇంటికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ పిలుపు మేరకు కరీంనగర్‌లోని తన నివాసంపై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్లతో కలిసి సోలార్ వ్యవస్థ పనితీరును పరిశీలించి, పథకం అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. తన ఇంటిలో నెలకు రూ.25–30 వేల వరకు వచ్చే విద్యుత్ బిల్లు, సోలార్ వల్ల రూ.5 వేలలోపే వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే సోలార్ ఏర్పాటుకు రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. 80 శాతం వరకు రుణ సదుపాయం కూడా అందుబాటులో ఉందని వివరించారు.

ప్రజలు విద్యుత్ కొనుగోలు చేసే స్థాయి నుంచి అమ్మే స్థాయికి చేరుకోవాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. రైతులు, సాధారణ ప్రజలు సోలార్ ద్వారా అదనపు విద్యుత్ ఉత్పత్తి చేసి డిస్కంలకు విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు. ఇక వ్యవసాయ రంగంలో సౌరశక్తి వినియోగాన్ని పెంచేందుకు PM-KUSUM పథకం అమలు జరుగుతోందని చెప్పారు. తెలంగాణలో 1,800 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటే లక్ష్యమని వెల్లడించారు. రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు ముందుకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అయితే రాష్ట్రంలో ఈ పథకాలపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటివరకు కరీంనగర్‌లో 46, సిరిసిల్లలో 17 దరఖాస్తులు మాత్రమే రావడం ఆందోళనకరమన్నారు. ఎక్కువ మంది రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఉపాధి హామీ పనుల కల్పనలో రాష్ట ప్రభుత్వం విఫలం..

**ముద్ర, సిరిసిల్ల:**
ఉపాధి హామీ పనుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ఫలమవుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన సిరిసిల్ల జిల్లా అంకిరెడ్డిపల్లె, ముస్తాబాద్ లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా 125 రోజులపాటు పని కల్పించా లనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకొచ్చినా, తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. సిరిసిల్ల జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు. అనంతరం ముస్తాబాద్ లో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

దేశవ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలను ధార్మిక చింతనతో నిర్వహిం చుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏ గ్రామం వెళ్లినా, ఏ ఆలయం వెళ్లినా సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలతో కళకళలాడాయన్నారు. కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టడాన్ని హర్షిస్తున్నామన్నారు. ఎవరైనా పార్టీ పెట్టొచ్చన్నారు.

## హిందువుల పట్ల వైఖరి మారాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** హిందువులపై పోలీసు అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని బీజేపీ సీనియర్ నేత రావుల రామ్ నాథ్ సూచించారు. నిర్మల్ జిల్లా లో హిందువులపై వరుస దాడులకు నిరసనగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన బంద్ పిలుపు విజయవంతం అయిందన్నారు. శనివారం నిర్మల్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొద్ది కాలంగా నిర్మల్ లో హిందువులపై జరుగుతున్న వరుస దాడులకు, డా. సంతోష్ రాజ్ పై జరిగిన దాడికి నిరసనగా ఈ బంద్ నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల స్థానిక పాత బస్టాండ్ సమీపంలో కారులో వెళ్తున్న హిందూ కుటుంబంపై దాడి, గతంలో భైంసా లో కె టి ఆర్ పర్యటన నినాదాలు చేసిన హనుమాన్ స్వాములపై 307 కేసుల వంటి వరుస ఘటనల పట్ల బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బంద్ విజయవంతం అయిన నేపథ్యంలో పోలీసులు తమ వైఖరిని మార్చుకొని అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూడాలని కోరారు. బంద్ కు సహకరించిన వ్యాపార సంఘాలకు, ప్రజలకు బీజేపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు, పట్టణ కౌన్సిలర్లు, పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 6న పిప్పిరిలో సీఎం బహిరంగ సభ




**బోథ్, ముద్ర:** పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తి తో పాటు 99 రోజుల ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6 న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామంలో ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభ ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు లు శనివారం తెలిపారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర ఉన్నత అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం హైదారాబాద్ లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసే పత్రాలను ప్రజలకు అందిస్తామని తెలిపారు. అధికారులు సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు వెడమ బొజ్జు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్ కు స్త్రీనిధి రాష్ట్ర స్థాయి పురస్కారం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా స్త్రీ నిధి రుణాల మంజూరు, రికవరీల్లో 2024–25 సంవత్సరానికి గాను రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు హైదరాబాద్ లోని రాజేంద్ర నగర్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో శనివారం మంత్రి సీతక్క చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. 2024–25 సంవత్సరానికి రూ. 10,649 కోట్ల రుణాలు లక్ష్యం కాగా లక్ష్యాన్ని మించి రూ 11,536 కోట్ల రుణాలు అందజేశారు. అలాగే రికవరీల లక్ష్యంలో రూ.108.33 కోట్లు వసూలు చేసి 88 శాతం మేర రికవరీ చేశారు. అలాగే ఉత్తమ మండలంగా లోకేశ్వరం నిలిచింది. ఉత్తమ ఉద్యోగులుగా లోకేశ్వరం సహాయ మేనేజర్ కల్పన, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణమ్మ, ఏపీడి చరణ్ దాస్ ఉన్నారు.

## బీజేపీ బంద్ విజయవంతం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణంలో డాక్టర్ సంతోష్ రాజ్ పై జరిగిన దాడి ఘటనకు నిరసనగా శనివారం బీజేపీ ఇచ్చిన నిర్మల్ పట్టణ బంద్ పిలుపు విజయవంతమైంది. ముందుగానే బంద్ పిలుపు నేపథ్యంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు తెరుచుకోలేదు. ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు ప్రకటించాయి. పాత బస్టాండ్ ప్రాంతంలో ఒక వర్గం వారు దుకాణాలు తెరిచే ప్రయత్నం చేయటంతో ఆందోళనకారులు అడ్డుకున్నారు. దీంతో కొంత ఘర్షణ చోటు చేసుకుంది. ఐతే పోలీసులు సకాలంలో స్పందించి ఈ ఘర్షణను నివారించారు. హోటళ్లు మూతపడ్డాయి. ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. అత్యవసర సర్వీసులైన మెడికల్ షాపులు, బస్సులను బంద్ నుంచి మినహాయించారు.

## లోక్ అదాలత్‌లో 32 కేసుల పరిష్కారం

**బోథ్, ముద్ర:**
జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 32 కేసులు పరిష్కరించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 39 మంది వ్యక్తులు కోర్టు ఎదుట హాజరయ్యారన్నారు. నిందితులకు విధించిన జరిమానా ద్వారా మొత్తం రూ.1,95,000 ప్రభుత్వ ఖాతాకు జమ అయినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఎక్సైజ్ నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేందుకు లోక్ అదాలత్ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బోథ్ లో బస్ డిపో ఏర్పాటు చేయండి



**బోథ్, ముద్ర:**
ఆదిలాబాద్ జిల్లా బోథ్ లో బస్ డిపోను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కోరారు.శనివారం అసెంబ్లీ హాలులో ఆర్టీసీ సమస్యలపై నిర్వహించిన సమావేశానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ బోథ్ మండల కేంద్రంలో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలని, బోథ్ నియోజకవర్గంలోని అన్ని గిరిజన గ్రామాలకు ఆర్టీసీ సేవలు కనెక్టివిటీ చేయాలని కోరారు. ఇచ్చోడ మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, రెస్ట్ రూంలు, తాగు నీటి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం ను అందజేశారు. నియోజకవర్గంలో మేజర్ రిమోట్, కనెక్టివిటీ గ్రామాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

# వృత్తి నైపుణ్యం అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రాష్ట్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్యం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తెలిపారు. జగిత్యాల అడ్వాన్సుడ్ టెక్నికల్ సెంటర్ ఏటీసీ కేంద్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో విద్యార్థుల నైపుణ్య శిక్షణలో భాగంగా చెక్కపై రూపొందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చిత్రాన్ని జగిత్యాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వర్ రెడ్డి, సిబ్బంది మౌనిక లు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నైపుణ్యం అభివృద్ధికి నియోజకవర్గాల్లో నూతనంగా రూ.35 కోట్ల చొప్పున ఐటీఐ లను అప్ గ్రేడ్ చేసిందన్నారు. నాయకులు ముస్కు ఎల్లారెడ్డి, రామచంద్రరావు, గట్టు సతీష్, సమీండ్ల శ్రీనివాస్, సురేందర్ రావు, తిరుమలయ్య, శ్రీనివాస్, మల్లయ్య, కొలగని సత్యం, శరత్ రావు, భూమయ్య పాల్గొన్నారు.

# వైద్యులు సమాజంలో ఒక భాగమే




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
వైద్యులు సమాజంలో ఒక భాగమని, ప్రజల సేవకి వైద్యులు తోడ్పడతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్మల్ శాఖ పేర్కొంది. ఈ మేరకు నిర్మల్ ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ బాధ్యులు మాట్లాడుతూ గురువారం సాయంత్రం డాక్టర్ సంతోష్ రాజ్ పై జరిగిన దాడి ఘటనలో ప్రజలంతా సంఘీభావం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బిల్లు అధికంగా వేసి ఇవ్వంనదుకే దాడి చేశారన్నారు. సంఘ బాధ్యులు డాక్టర్లు మురళీధర్, ప్రమోద్ చంద్రారెడ్డి, దేవేందర్ రెడ్డి, రామకృష్ణ, సంతోష్ రాజ్, రంజిత పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శనివారం జిల్లాలోని మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 29-03-2026
www.mudranews.in | @mudranews



**ఐజేయూ : స్పష్టత కోసం డిమాండ్**

అధికారుల చర్యల్లో పారదర్శకత లేకపోతే IJU వివరణ కోరుతుంది. బాధ్యతాయుత పరిపాలనకు దోహదపడుతుంది.

Indian Journalists Union

## బాలుడిపై వీధి కుక్కల దాడి ఘటనపై హెచ్ఆర్సీలో కేసు నమోదు

### - రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఫిర్యాదు



ముద్ర ప్రతినిధి, భువనగిరి: వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి చూపు కోల్పోయిన బాలుడికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది వినోద్ హిందూస్థానీ రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హెచ్ఆర్సీ శనివారం కేసు నమోదు చేసింది.

ఈ సందర్భంగా న్యాయవాది వినోద్ హిందూస్థానీ మాట్లాడుతూ బాలుడు శాశ్వతంగా చూపు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారని, మునిసిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని మండిపడ్డారు. విధి నిర్వహణలో విఫలమైన భువనగిరి మున్సిపల్ అధికారులపై తక్షణమే శాఖాపర మైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాలుడికి అవసరమైన అత్యుత్తమ వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వ ఖర్చుతోనే అందించాలని హెచ్ఆర్సీకి సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

## బాలుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ముద్ర ప్రతినిధి, భువనగిరి: భువనగిరి పట్టణంలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మూడేళ్ల బాలుడు ప్రియాన్ష్ ను మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శనివారం పరామర్శించారు. హైదరాబాద్ లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని, కుటుంబ సభ్యులను కలిసి ఆయన ధైర్యం చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇట్టబోయిన గోపాల్, కౌన్సిలర్ నగేష్, వార్డు నాయకులు ఆనంద్ ఉన్నారు.

## బాలుడికి అండగా ఉంటాం..

### - ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



ముద్ర ప్రతినిధి, భువనగిరి: భువనగిరి పట్టణంలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి, హైదరాబాద్ లోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన బాలుడిని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఎల్.వి. ప్రసాద్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో, బీబీనగర్ ఎయిమ్స్ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా చర్చించారు. చిన్నారి ప్రియాంష్‌కు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది కలగకుండా, బీబీనగర్ ఎయిమ్స్ ద్వారా సాధ్యమైనంత మెరుగైన అత్యాధునిక వైద్య చికిత్స అందేలా చూడాలని కలెక్టర్, ఎయిమ్స్ అధికారులను ఎంపీ కోరారు.

## దళిత సర్పంచ్ లు, కౌన్సిలర్లకు ఆత్మీయ సన్మానం




ముద్ర ప్రతినిధి, భువనగిరి: మహనీయుల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రాం భవనంలో భువనగిరి మండల, పట్టణ దళిత సర్పంచ్ లు, కౌన్సిలర్ల, ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం శనివారం బండారు రవివర్ధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఐక్య వేదిక జిల్లా చైర్మన్ బట్టు రాంచంద్రయ్య, నాగరం అంజయ్య, దొనకొండ రాములు మాట్లాడుతూ మహనీయులు కలలు గన్న సమానత్వ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలో సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంతల నరసింహ, పాశం అమర్నాథ్, బండారి స్వర్ణలత, జాలిగం విగ్నేష్, బర్రె పూజిత జహంగీర్, తుక్కపురం సర్పంచ్ జనగాం పాండు, అనంతరం సర్పంచ్ పల్లెపాటి నాగమణి రాజలింగం, చీమల కొండర్ సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, బాలంపల్లి సర్పంచ్ కాశపాక సాయి కృష్ణలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బర్రె జహంగీర్, ఇటుకల దేవేందర్ మాదిగ, నాగరం శంకర్, కారుపాటి రాజు, కుతడి సురేష్, దుబ్బ రామకృష్ణ, కనుకుంట్ల రమేష్ కోటి,ఎర్ర మహేష్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు

ముద్ర ప్రతినిధి, భువనగిరి: భువనగిరి పట్టణంలోని గృహ వినియోగదారులు, వ్యాపారస్తులు తమ వద్ద ఉన్న చెత్తను విధిగా మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకే అందించాలని మున్సిపాలిటీ కమిషనర్ రామలింగం శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. ఇండ్లు, దుకాణాల నుంచి వచ్చే చెత్తను కేవలం మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలని, రోడ్లపై లేదా ఖాళీ స్థలాలలో చెత్త వేయడం నిషిద్ధమని, రోడ్లపై వేసిన చెత్తకు వీధి కుక్కలు, పందులు, కోతులు అలవాటు పడి నివాస ప్రాంతాల్లోకి చొరబడుతున్నాయని దీనివల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందన్నారు. మీ ప్రాంతానికి చెత్త సేకరణ వాహనం రాకపోయినా, సిబ్బంది నిర్లక్ష్యం వహించినా 8247820991కు ఫిర్యాదు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి భారీ జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరించారు.

## సదరం కేసులు త్వరితగతిన పూర్తిచేయాలి





### - వీడియో కాన్ఫరెన్స్ లో సెర్ప్ సీఈఓ దివ్య

ముద్ర ప్రతినిధి, భువనగిరి: జిల్లాలో సదరం పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని, యుడిఐడి దరఖాస్తులపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ సీఈఓ దివ్య అధికారులకు సూచించారు. సదరం క్యాంపుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఈఓ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో సదరం సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలి. యుడిఐడి దరఖాస్తులు వచ్చిన వెంటనే సదరంలో నమోదు చేయాలన్నారు. కొత్త దరఖాస్తులపై సమయానికి వికలాంగత సర్టిఫికేట్లు జారీ చేయాలని, రెన్యువల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. యుడిఐడి కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, సంబంధిత డేటాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డిజిటలైజేషన్, సరెండర్ పోగొట్టుకున్న కార్డుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎన్ హెచ్ సీ, పీడబ్ల్యుడీ, ఎస్ హెచ్ జీ సభ్యులలో యుడిఐడి కార్డులు లేనివారికి వెంటనే జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ డి ఆర్ డి ఏ నెలకు సంబంధించిన సదరం స్లాట్లు ఇప్పటికే విడుదలయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు క్యాంపులకు సకాలంలో హాజరు కావడానికి వారికి ఫోన్ కాల్ ద్వారా ముందస్తుగా సమాచారమివ్వాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

ఈ సమావేశంలో డాక్టర్ కిరణ్, సుమన్, సదరం సిబ్బంది పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడులను నివారించాలి

### - జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, భువనగిరి : వీధి కుక్కల దాడులను నివారించి, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కుక్కల జనాభాను నియంత్రించేందుకు పెద్ద ఎత్తున స్టెరిలైజేషన్ (జనన నియంత్రణ) ఆపరేషన్లు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో వీధి కుక్కలను గుర్తించి వాటికి స్టెరిలైజేషన్ చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. రోడ్లపై తిరిగే జంతువులను, కుక్కలను తరచూ పెట్రోలింగ్ చేస్తూ గుర్తించి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ అధికారి సరిత, పశుసంవర్ధక శాఖ అధికారి జానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా వైద్యశాఖ అధికారి మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి సాయికృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖలథ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కారు దగ్ధం



బీబీనగర్, ముద్ర: బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారు శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. కారు (టీఎస్03 ఈఎన్ 6575) వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన యజమాని అప్రమత్తమై వాహనం నుంచి దిగిపోవడంతో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా స్పందించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### - కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర, మోత్కూరు: గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం మోత్కూరులోని ఎస్సీ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వంట గదులకు వెళ్లి వంటలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో మౌళిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏం చదువుతున్నారు.. భోజనం బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ బాలాజీ, ఎంపీఓ జనార్దన్ రెడ్డి మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో చెత్త కుప్పల తొలగింపు



ముద్ర, మోత్కూర్: మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్‌లో చాలా కాలంగా పేరుకుపోయిన చెత్త కుప్పలు, ముళ్లపొదలుస్థానికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఈ సమస్యను స్థానికులు కౌన్సిలర్ మెంట రమణ నగేష్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కౌన్సిలర్ మెంట రమణ నగేష్ స్వయంగా వార్డులోకి వెళ్లి డోజర్ పిలిపించి పేరుకుపోయిన చెత్త కుప్పలు, ముళ్ల పొదను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ కిరణ్ పాల్గొని పనులను సమన్వయం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మెంట రమణ నగేష్ ను కాలనీవాసులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడి మహేష్, మహమ్మద్ మోయిజ్, మెంట నరసింహ తదితరులు పాల్గొని సహకారం అందించారు.

## కేజీబీవీ విద్యార్థులకు వైద్య పరీక్షలు



ముద్ర, మోత్కూర్: ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి చికిత్స అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవీన్ సింగ్, గాంధీ, మాధవి, కేజీబీవీ ప్రత్యేక అధికారిని యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ముద్ర, మోత్కూర్: మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో పోచం సత్తయ్య –కిష్టమ్మ ల జ్ఞాపకార్థం ఉచిత కుట్టు శిక్షణ ఉపాధి కేంద్రంను మున్సిపల్ ఛైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, వైస్ ఛైర్మన్ పల్లెర్ల వెంకన్న లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇట్టి సద అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లను పోచం నారాయణ శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ గుర్రం లక్ష్మి నర్సింహారెడ్డి, నిర్వాహకులు పోచం నారాయణ, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న, కూర్మిళ్ల ప్రమీల, గనగాని శైలజ, పన్నాల శ్రీవిద్య, మెంట రమణ, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు గనగాని నర్సయ్య, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలి

### - జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి. వెంకన్న



ముద్ర, తుంగతుర్తి: పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి. వెంకన్న తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధి నివారణ, గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం కొనసాగుతున్న తీరును జిల్లా పశు వైద్యా ధికారి శనివారం తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తుంగతుర్తి గ్రామంలో 1000 పశువులకు గాను 802 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలను ఇచ్చినట్లు తెలి పారు. మిగతా పశువులకు కూడా త్వరలో టీకాలు ఇవ్వన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలని సూచించారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువు నీరస పడి పోయి క్షీణిస్తుందని తద్వారా మిగతా పశు వులకు సైతం వ్యాధి సోకుతుందని అన్నారు. గాలికుంటు వ్యాధి సోకక ముందే ముందు జాగ్రత్తగా టీకాలు ఇప్పిం చాలని రైతులను కోరారు.

ఈ కార్యక్రమంలో తుంగతుర్తి పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ బి. రవి ప్రసాద్, గోపాల మిత్రులు లింగయ్య, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాజ్ పూర్ లో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన



ముద్ర ప్రతినిధి, భువనగిరి: భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు (RAWEP 2025 – 26) రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్ మాట్లాడుతూ తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో తమ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరమన్నారు. వ్యవసాయ విద్యలో భాగంగా విద్యార్థులకు 3 సంవత్సరాల చదువు తరువాత ఒక గ్రామాన్ని ఎన్నుకొని అక్కడ 6 నెలల పాటు రైతులతో ఉంటూ వారికి పంట పొలాల్లో టెక్నాలజీ పరంగా కానీ మరే ఇతర వ్యవసాయ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు ఉపయోగపడుతూ, విద్యార్థులకు తెలియని విషయాలు రైతుల దగ్గర నేర్చుకుని వారు చదువుకున్న చదువును రైతు సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తారని తెలిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు సందర్శన చాల బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, డా. డి. శ్రీలత, శ్రీనివాస్, మండల రైతులు కంచి మల్లయ్య, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్, రైతులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
29.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


ఐజేయూ : సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా పోరాటం

మీడియా కంటెంట్‌ను అన్యాయంగా బ్లాక్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తుంది. స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే హక్కును సమర్థిస్తుంది.

IJU Indian Journalists Union



# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


- రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి
- మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

రోడ్లపై పెండింగ్ పనులు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలు లేకుండా చూడాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ, మత్తు పదార్థాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు సకాలంలో క్షేమంగా ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై పెండింగ్‌లో ఉన్న సీసీ కెమెరాలు, సిగ్నల్స్, విద్యుత్ దీపాలు, సైన్ బోర్డులు, గుంతలు పూడ్చడం వంటి పనులను త్వరగా పూర్తి చేసి ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. విద్యాసంస్థలు, కళాశాలలో రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నందున వాహనదారులు తప్పనిసరిగా నియమాలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్లపై ఉన్న వివిధ సిగ్నల్స్, మార్కింగ్‌ల గురించి తెలుసుకుని జాగ్రత్తగా ప్రయాణం చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలపై నిఘా పెంచాలని, మత్తుకు అలవాటు పడి యువకులు తమ భవిష్యత్తు కోల్పోకుండా చూడాలని అన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. విద్యాలయాలు, మెడికల్ షాపులు, పరిశ్రమల్లో నిరంతరం మత్తు పదార్థాలపై నిఘా పెట్టామని చెప్పారు. మత్తుతో జీవితాలు చిత్తు అయిపోతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎంహెచ్ఓ డా. శ్రీరామ్, డీఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా నాణ్యతలో 'రామంచ' ఆదర్శం

- ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించిన జిల్లా ప్యానల్ ఇన్‌స్పెక్షన్ బృందం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలను జిల్లా స్థాయి ప్యానల్ తనిఖీ బృందం సభ్యులు కోళ్ల పద్మారెడ్డి, నాగేందర్, నీరడి లక్ష్మీనారాయణలు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలను సమగ్రంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల మోడల్ లెసన్స్‌తో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. పాఠశాల రికార్డులు, హాజరు నమోదు, విద్యా ప్రణాళిక, డిజిటల్ తరగతి బోధన, ఏఐ, ఏఎక్స్ఎల్, పాఠశాల ఇండెక్స్, మధ్యాహ్న భోజనం, స్కూల్ క్యాలెండర్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, స్కావెంజర్, మధ్యాహ్న భోజన సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించడాన్ని అభినందించారు. పాఠశాల పరిసరాలు, బడి తోటను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించిన తనిఖీ బృందం, పాఠశాల విద్యా ప్రమాణాలు ఆదర్శంగా ఉన్నాయని పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వి. సురేష్ కుమార్, ఉపాధ్యాయులు సునీత, ఆబేదా బేగం, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప పాల్గొన్నారు.

# వన్ టైమ్ సెటిల్‌మెంట్‌తో డబ్బు, సమయం ఆదా

- జిల్లా జడ్జి కే. సాయి రమాదేవి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

లోక్ అదాలత్ ద్వారా వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకొని లబ్ధి పొందాలని జిల్లా జడ్జి కే. సాయి రమాదేవి కక్షిదారులకు సూచించారు. శనివారం జిల్లా కోర్టు హాల్లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి, పరిష్కరించుకునేందుకు వీలున్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు తదితర కేసులను కక్షిదారుల సమ్మతితో వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గం రాజమార్గమని, సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బాధ లేకుండా లోక్ అదాలత్ ద్వారా వెంటనే పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా కక్షిదారుల సమయం వృథా కాకుండా, లబ్ధి కూడా సత్వరమే అందుతుందని తెలిపారు. లబ్ధి కోసం ఎక్కువకాలం నిరీక్షించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న తొలి లోక్ అదాలత్ కార్యక్రమం కోసం జిల్లా కోర్టులో ఏడు బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల కోర్టుల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ పార్క్ స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

- రూ.20 లక్షలతో పునరుద్ధరణ.. ప్రజలకు అందుబాటులోకి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను శనివారం టీజేఏసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఈ పూల్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ సుమారు పదేళ్ల క్రితం నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్ సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారిందని తెలిపారు. యువజన సంక్షేమశాఖ, స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో నాణ్యత తప్పనిసరి

- అకాల వర్షా ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లై, వ్యవసాయ, పోలీస్, గ్రామీణ అభివృద్ధి, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లర్ యాజమాన్యాలతో యాసంగి వరి ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రభుత్వం ఒక క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369గా నిర్ణయించిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్ద ఎత్తున ప్రారంభించాలని సూచించారు. యాసంగి సీజన్‌కు 4,45,466 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 413 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో ఐకెపి 154, పిఎసిఎస్ 224, డీసీఎంఎస్ 9, ఎఫ్పిఓ 26 కేంద్రాలు ఉండగా, మొత్తం 413 కేంద్రాలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వడగండ్లు, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సరైన తేమశాతాన్ని నమోదు చేసి ట్యాబ్ ఎంట్రీ చేయాలని తెలిపారు. ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉన్నాయని, వాటిలో సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు దేవ్ కుమార్, నిత్యానంద్, జగదీష్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



# డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణం

- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు
- పోలీస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని మెదక్ వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో, బస్సు, లారీ డ్రైవర్లతో పాటు పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లలో చూపు సమస్యలను ముందుగానే గుర్తించి ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చూపు సమస్యల కారణంగా ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి డ్రైవర్ నిరంతరం కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు. ద్విచక్ర వాహనదారులు, పిలియన్ రైడర్లు తప్పనిసరిగా ప్రమాణిత హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏఆర్ డీఎస్పీ రంగానాథ్, సీఐలు జార్జ్, మహేష్, కృష్ణమూర్తి, ఆర్ఐ రామకృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులపై దాడి చేసిన మనువడు అరెస్ట్

- 4.5 తులాల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

వృద్ధ దంపతులపై ఇనుప రాడ్‌తో పట్టపగలు దాడి చేసి వారి వద్ద ఉన్న నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఎలాంటి పని చేయకుండా సులభంగా డబ్బులు సంపాదించి, చేసిన ఎనిమిది లక్షల అప్పులు తీర్చేందుకు ఈ దాడికి పాల్పడ్డాడని వెల్లడించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలిపారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు తుమ్మల అంజయ్య, సావిత్రికి ఐదుగురు సంతానం ఉన్నారు. ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిపారు. అందులో పెద్ద కూతురు కృష్ణవేణి తన కుమార్తెను కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మాసన్‌పల్లికి చెందిన పరిగే వెంకటనారాయణకు వివాహం చేశారు. ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యం సేవిస్తూ వెంకటనారాయణ ఎనిమిది లక్షల రూపాయలు అప్పు చేశాడు. ఆ అప్పు సులభంగా తీర్చాలనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం తుప్రాన్ నుంచి చిన్న శంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి వెళ్లి, ఇంట్లో ఇతరులు లేని సమయంలో పట్టపగలు దాడికి పాల్పడ్డాడు. వృద్ధ దంపతుల పెద్ద కుమార్తె కృష్ణవేణి కుమార్తె భర్త అయిన వెంకటనారాయణ (వరుసకు మనువడు) ముఖానికి మాస్క్ వేసుకుని కత్తితో బెదిరించి, ఇనుప రాడ్‌తో ఇద్దరినీ బలంగా కొట్టాడు. అనంతరం వృద్ధురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, తులంన్నర బంగారు గొలుసు, అర తులం బంగారు ఉంగరాన్ని తీసుకుని ఈ నెల 25న పరారయ్యాడు. వృద్ధ దంపతుల పెద్ద కుమారుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు దీనిని ఛాలెంజ్‌గా తీసుకుని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి 48 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్, డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకట్ రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దాం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు రెండు, మూడు, నాలుగుల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన కల్పగూర్, అంగడిపేట్, మల్కాపూర్ గ్రామాల్లో ప్రత్యేక శీతాకాల శిబిరాల భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు దత్తత గ్రామాల్లో ప్రజలకు వివిధ అంశాలపై ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ట్రాఫిక్ ఎస్ఐలు సాయిలు, రాములు, గోప్యా చౌహాన్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ జగదీశ్వర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సాయిలు, రాములు, గోప్యా చౌహాన్, ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రకాష్‌రావు, కానిస్టేబుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్ లేకుండా డ్యూటీకి రావద్దు

- పోలీస్ సిబ్బందికి ఏసీపీ సూచన
- పోలీస్ సిబ్బందికి 55 హెల్మెట్ల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

పోలీస్ సిబ్బంది హెల్మెట్ ధరించకుండా డ్యూటీలోకి రావద్దని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మహీంద్రా షోరూమ్ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ సిబ్బందికి 55 హెల్మెట్లను ఏసీపీ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాజీవ్ రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కాకుండా రక్షించుకోవచ్చని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో యువతకు హెల్మెట్లు అందించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్మెట్లు అందించేందుకు చొరవ చూపిన త్రీ టౌన్ సీఐ లక్ష్మీబాబును ఆయన అభినందించారు.

# 60 సీసీ కెమెరాల ఏర్పాటు

- ప్రారంభించిన ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని అన్నారు. శనివారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. దొంగతనాలు, చోరీలు జరిగితే సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను సులభంగా గుర్తించి పట్టుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ సీఐ మహేష్, ప్రజాప్రతినిధులు, దాతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐజేయూ : సెటైర్, విమర్శకు మద్దతు
సమాజంలో విమర్శ, వ్యంగ్యం ముఖ్యమని IJU గుర్తిస్తుంది. వాటిని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని చెబుతుంది.
IJU Indian Journalists Union

## కరీంనగర్ మహాశక్తి ఆలయంలో సోమనాథ మూల జ్యోతిర్లింగం

- బారులు తీరిన భక్తులు
- పాటలతో అలరించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందం



**ముద్ర, కరీంనగర్:**

సుమారు వెయ్యి ఏళ్ల నాటి ప్రాచీనమైన సోమనాథ్ జ్యోతిర్లింగం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ ఆశీస్సులో కరీంనగర్ ఆధ్వర్యంలోని పవిత్ర సోమనాథ మూల జ్యతిర్లింగాలను మహాశక్తి ఆలయానికి తీసుకువచ్చారు. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా భక్తులందరికీ జ్యోతిర్లింగాల దర్శనం కల్పించాలనే మహాశయంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక ప్రాంతాల్లో జ్యోతిర్లింగాల దర్శనం కల్పించారు.

తెలంగాణలో ఉగాది పర్వదినం సందర్భంగా హైదరాబాద్ లో జ్యోతిర్లింగాల దర్శనం భక్తులకు కల్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి మేరకు ఈ మూల జ్యోతిర్లింగాలను మహాశక్తి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రిషి దేవ్ రథ్ మూల జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకం చేశారు. జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భారీ ఎత్తున భక్తులు మహాశక్తి ఆలయానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గాన కచేరి నిర్వహించారు. వినసొంపైన ఆధ్యాత్మిక గీతాలు వింటూ జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకుంటూ భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాశక్తి ఆలయ పూజారులు, వేదపండితులతోపాటు స్టేట్ టీచర్స్ కో ఆర్డినేటర్ గంగిశెట్టి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ పై దాడి కేసులో నలుగురి అరెస్ట్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ లో రెండు రోజుల క్రితం డాక్టర్ పై దాడి కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల వెల్లడించారు. విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బందిపై భౌతిక దాడికి పాల్పడిన నిందితులను సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా మహమ్మద్ సల్మాన్ హుస్సేన్ @ షేక్ సల్మాన్, మహమ్మద్ షౌకత్, షాబాద్ అలీ, మహమ్మద్ ఆజాద్ హుస్సేన్ లుగా గుర్తించామన్నారు. వీరిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్ కు తరలించామని తెలిపారు. ఈ కేసులో తీవ్రంగా శ్రమించి నిందితులను పట్టుకున్న నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్, భైంసా రూరల్, నిర్మల్, నిర్మల్ రూరల్ ఇన్ స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, కృష్ణ, సమ్మయ్య, నిర్మల్ రూరల్, నర్సాపూర్, సోన్ ఎస్ఐలు లింబాద్రి, గణేష్, గోపి లను ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించారు.

## బెట్టింగ్ నిర్మూలిద్దాం, యువతను కాపాడుకుందాం

- కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



సంగారెడ్డి జిల్లాలో అక్రమ బెట్టింగ్‌పై పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు, నేటి నుంచి ప్రారంభమవుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ సందర్భంగా యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఐపీఎల్‌ను కేవలం ఆటగా మాత్రమే ఆస్వాదించాలని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అక్రమ బెట్టింగ్‌కు పాల్పడవద్దని కొండాపూర్ ఎస్సై హెచ్చరిస్తున్నారు. ఇటీవల యువకులు ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌కు ఆకర్షితులై పెద్ద మొత్తంలో డబ్బులు కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, మానసిక ఒత్తిడికి గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. చిన్నగా ప్రారంభమైన బెట్టింగ్ అలవాటు పెద్ద సమస్యగా మారి, చివరకు నేరాలకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారు ఆన్లైన్లో ఏమి చూస్తున్నారు, ఏయే యాప్స్ వాడుతున్నారు అనే విషయాలను గమనించాలని సూచించారు. ఎవరైనా బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు సమాచారం ఉంటే 8712656746 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

# బస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆర్టీసీ సమస్యలపై ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధుల ముఖాముఖి సమావేశం



**ముద్ర, కరీంనగర్:**

రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మహా లక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజకవర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు తదితర అవసరాల పై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. శనివారం అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ 1 లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి తో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని సూచించారు. సింగరేణి ఏరియా లో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గంలో మెట్ పల్లి, కోరుట్ల బస్ స్టేషన్ లను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ కు విజ్ఞప్తి చేశారు. దక్షిణ కాశీగా పిలువబడే వేములవాడకు అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడకు సిరిసిల్ల, కోరుట్ల, జగిత్యాల, మెట్ పల్లి డిపో లో నుంచి బస్సులు పెంచాలని సూచించారు. వేములవాడ, చందుర్తి బస్ స్టేషన్ లను మోడర్న్ స్టేషన్లు గా అభివృద్ధి చేయాలని కోరారు. హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ లో ఇప్పటికే రూ.1.5 కోట్ల తో బస్టాండ్ నిర్మించమని. దానికి మరిన్ని నిధులు కేటాయిస్తే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. అక్కడే ఉన్న ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. పెద్దపల్లి జిల్లాకు చిరకాల స్వప్నం బస్సు డిపో మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే విజయరమణరావు ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా డిపో పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. పెద్దపల్లి నుంచి హైదరాబాద్, హనుమకొండ కు కొత్త బస్సులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమ నియోజకవర్గంలో కొమురవెల్లికి అధికంగా వెళ్తుంటారని తెలిపారు. ఓదెల నుంచి కొమురవెల్లకి ప్రత్యేక బస్సు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. రామగుండంలో గతంలో నడిచిన సిటీ బస్సులను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కొత్త రూట్లలో బస్సులు నడిపించాలని సూచించారు. గోదావరిఖని ఆర్టీసీ ఖరీదైన స్థలంలో ముందు వైపు షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. చొప్పదంటి ఆర్టీసీ కాంపౌండ్ వాల్ కొంత రోడ్డుకు ఇస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. కోడిమ్యాల బస్ స్టేషన్ పనులు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల స్కూల్ సమయంలో అదనంగా బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జగిత్యాల నుంచి కడెం బస్సులు నడిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ కు బస్సులు పెంచాలన్నారు. నిజాం కాలంలో నిర్మించిన ఆసిఫాబాద్ పురాతన బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ లో ఫ్లాట్ ఫాం సంఖ్య పెంచాలని కోరారు. 2027 జూన్ లో పుష్కరాలు సమీపిస్తుండటంతో బాసర లో బస్ స్టేషన్ ఆధునీకరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ విజ్ఞప్తి చేశారు. ఫ్లాట్ ఫామ్ పెంచాలని, టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. . సిర్పూర్ కాగజ్ నగర్ లో బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని, రోడ్లతో సంబంధం లేకుండా మారుమూల ప్రాంతాల్లో బస్సులు నడపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ విజ్ఞప్తి చేశారు. అశ్వారావుపేట లో కవడిగుండ్ల, గుమ్మడవల్లికి దశాబ్ద కాలం తర్వాత బస్సులు రావడం పట్ల ఎమ్మెల్యే ఆది నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. దమ్మపేట బస్ స్టేషన్ శిథిలావస్థలో ఉండడంతో దానిని 60 లక్షలు మంజూరయ్యాయనీ, త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. ఇల్లందు నియోజకవర్గంలో అదనంగా బస్సులు నడపాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. వైరా నియోజకవర్గం నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉందని అదనంగా బస్సులు వేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కోరారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల వారిగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులు స్వీకరించామని తెలిపారు. అన్ని జిల్లాలో నియోజకవర్గాల వారిగా ఆర్టీసీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. బస్ స్టేషన్ అభివృద్ధిలో ఆర్టీసీతో ఎమ్మెల్యేలు తమ నిధులు వెచ్చించి సహకరించాలని కోరారు. . ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఆ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ ఆదిలాబాద్, ఖమ్మం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, డా. సంజయ్ కుమార్, కౌశిక్ రెడ్డి, మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, విజయ రమణ రావు, వెడ్మా బొజ్జు, కోవా లక్ష్మీ, అనిల్ జాదవ్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ నాయక్, జారే ఆది నారాయణ, కోరం కనకయ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీ లు , ఆర్ఎం లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ వేదికపై విరాజిల్లిన నిర్మల్ ఖ్యాతి



- జిల్లాకు రెండు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డులు
- ఢిల్లీలో స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

**ముద్ర ప్రతినిధి , నిర్మల్:**

జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా మరోసారి తన ఖ్యాతిని చాటింది. జిల్లాకు రెండు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డులు దక్కాయి. వివిధ జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గాను ఈ అవార్డులు నిర్మల్ జిల్లా సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా ఈ అవార్డులను కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం స్వీకరించారు. జిల్లాకే తలమానికమైన కొయ్య బొమ్మల పరిరక్షణ, చారిత్రాత్మక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్ర కోసం ఏర్పాటు చేసిన పొనికి వనానికి జాతీయ స్థాయి స్కోచ్ అవార్డు లభించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మితో కలిసి కలెక్టర్ దీన్ని స్వీకరించారు. "అమ్మరక్షిత" అనే వినూత్న కార్యక్రమం ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించిన కారణంగా మరో స్కోచ్ అవార్డును వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్ తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరోమారు జిల్లాకు జాతీయ స్థాయి అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.

### "పోలీస్ అక్క" స్ఫూర్తిదాయకం

- జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు రాష్ట్రానికి గర్వకారణం
- నిర్మల్ ఎస్పీకి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

మహిళల భద్రత కోసం, ముఖ్యంగా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికి వినూత్నమైన ఆలోచనతో “పోలీస్ అక్క” పేరిట నిర్మల్ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్ఫూర్తిదాయకమైన కార్యక్రమానికి జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు లభించడం తెలంగాణకు గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డును అందుకున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిలకు సీఎం శనివారం హైదరాబాద్ లో అభినందనలు తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మహిళల భద్రతపై అవగాహన కల్పించే విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దాదాపు 7 వేల మంది విద్యార్థినులు, మహిళలకు అవగాహన కల్పించడం ప్రశంసనీయమని అన్నారు. నిర్మల్ లో నిర్వహించిన "పోలీస్ అక్క" కార్యక్రమం యావత్ పోలీసు యంత్రాంగానికి మంచి ప్రేరణగా నిలుస్తుందని కొనియాడారు. సమస్య ఎదురైనప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై మహిళా పోలీసు అధికారులు పోలీస్ అక్కలుగా మారి మహిళలు, బాలికలకు ఆత్మవిశ్వాసం కల్పించడం అభినందనీయమని తెలిపారు.

## అంజన్న భక్తులతో శునకం పాదయాత్ర

- ఆదరించి బిస్కెట్లు పెట్టారని 130km తోడుగా...
- కాళ్ల నొప్పులకు సాక్సులతో సాయం
- శునకం భక్తికి నెటిజన్లు ఫిదా

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**




విశ్వాసంలో శునకానికి మించినది ఏది లేదు. అలాంటిది విషయాన్ని నిజం చేస్తూ కేవలం రూ.5 బిస్కెట్ లు పెట్టి ఆదరించినందుకు 130 కిలో మీటర్ల మేర భక్తులకు తోడుగా నడిచిన ఓ శునకం విశ్వాసంతో కూడిన భక్తిని చూసిన వారంతా ఫిదా అయ్యారు. ఈ శునకం భక్తి ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూరుకు చెందిన కొందరు భక్తులు హనుమాన్ దీక్ష తీసుకున్నారు. మండల దీక్ష పూర్తికావడంతో మొక్కు తీర్చుకోవడానికి కాలినడకన కొండగట్టు ఆలయానికి పాదయాత్రన బయలుదేరారు. ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే వారికి దారిలో ఓ శునకం ఎదురైంది. ఆకలితో ఉన్న ఆ మూగజీవికి భక్తులు రూ.5 బిస్కెట్ ప్యాకెట్‌లను వేశారు. దీంతో అప్పటినుంచి శునకం తన విశ్వాసాన్ని చూపించింది. అప్పటి నుంచి ఆ భక్తులు ఎక్కడికి వెళ్తే అక్కడికి, వారు ఎక్కడ ఆగితే అక్కడ ఆ శునకం కూడా వారి వెంటే పాదయాత్రగా నడిచింది. ఐదు రోజులగా గుడిహత్నూరు నుంచి కొండగట్టు వరకు సుమారు 130 కి.మీ మేర ఆ భక్తులతో కలిసి నడిచింది. మార్గమధ్యంలో ఎన్ని కుక్కలు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా వారి తోడును మాత్రం వదల్లేదు.

### నడకతో కాళ్ల వాపులు...

సుమారు 130 కిలో మీటర్ల నడక వల్ల ఆ కుక్క కాళ్లు వాచిపోయి, నడవలేని స్థితికి చేరుకుంది. అది గమనించిన భక్తులు ఆ మూగజీవి పడుతున్న శ్రమను చూసి చలించిపోయి వారు, దానికి సాక్సులు తొడిగి, కాళ్లకు మందులు రాసి సపర్యలు చేశారు. తమతో పాటే దానికి కూడా ఆహారం పెడుతూ, ఒక కుటుంబ సభ్యుడిలా చూసుకున్నారు. ఎట్టకేలకు శనివారం ఉదయం కొండగట్టుకు చేరుకున్నారు. ప్రస్తుతం ఆ శునకానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.



## నిర్మల్ గుట్టలపై అరుదైన రాళ్లు

- రాగాలు పలికే వాటిగా గుర్తింపు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా గుట్టలపై పలుచోట్ల శబ్దం వచ్చే అరుదైన రాళ్లను గుర్తించినట్లు కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావు తెలిపారు. తమ పరిశోధనలో వెల్లడైన విషయాలను ఆయన వివరిస్తూ ఈ రాళ్లను అరుదైన భూభౌతిక వారసత్వంగా సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికులు వీటిని “కంచు బండలు”గా పిలుస్తున్నారని చెప్పారు. సుమారు 66 మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడిన దక్కన్ పీఠభూమిలో అగ్నిపర్వత విస్ఫోటనాల వల్ల పైకి వచ్చిన లావా గట్టిపడి బసాల్ట్ శిలలుగా మారిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఏర్పడిన కొన్ని శిలలు ఘన నిర్మాణం కారణంగా శబ్ద తరంగాలను విడుదల చేస్తాయన్నారు. ఈ శిలలను శాస్త్రీయంగా లిథో ఫోన్స్ అని పిలుస్తారన్నారు. దీన్ని మరొక రాయితో లేదా పనిముట్లతో కొట్టినప్పుడు కంచు మోగినట్లుగా స్వరాలు వినిపిస్తాయన్నారు. అందువల్ల ఇవి “రింగింగ్ స్టోన్స్” లేదా “రాగాలు పలికే రాళ్లు”గా ప్రసిద్ధి చెందాయి.

జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఈ రాళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. జ్ఞాన సరస్వతి ఆలయం బాసర వద్ద “వేద శిల”గా పిలువబడే రాయి కూడా ఇలాంటి స్వరాలు పలికే బసాల్ట్ శిలగా భావిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ ఖిల్లా గుట్ట పడమర వైపున్న రాళ్ల శ్రేణిలో పెద్ద రాయి కూడా స్వరాలు పలికే లక్షణం కలిగి ఉందన్నారు. నిర్మల్ జిల్లాలో ఉన్న ఈ అరుదైన రాళ్లను జియోహెరిటేజ్ స్పాట్‌గా అభివృద్ధి చేసి సంరక్షించాలని తుమ్మల దేవరావు కోరారు. ఈ క్షేత్ర పర్యటనలో నేరెళ్ల హన్మంత్, అబ్బిడి రాజేశ్వర్ రెడ్డి, దొంతుల భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
29.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఐజేయూ : జర్నలిస్టుల ఐక్యతకు వేదిక

దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. వారి సమస్యలను సమిష్టిగా ముందుకు తీసుకెళ్తుంది.



# రైల్వే లైన్ పనుల్లో అనాలోచిత నిర్ణయం

- **మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రతినిధి :**

మహబూబ్ నగర్ పట్టణం మధ్య లోంచి వెళుతున్న రైల్వే లైన్ పనుల్లో అధికారులు అనాలోచిత నిర్ణయం వల్ల పలువురు ఇళ్ళు కోల్పోతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. శనివారం రైల్వే లైన్ పనుల్లో ఇళ్ళు కోల్పోతున్న వారిని ఆయన కలిసి మాట్లాడారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే డబుల్ లైన్ ప్రతిపాదన తీసుకువచ్చారన్నారు. రైల్వే అధికారులు చేపడుతున్న డబుల్ లైన్ పనుల విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ అధికారులు అనాలోచితం గా నిర్ణయం తీసుకోవడంతో రెండు వైపుల తొమ్మిది మీటర్లు భూమి తీసుకుంటే సమస్య లేదన్నారు. ఒకవైపు ఎక్కువ, మరోవైపు తక్కువ తీసుకోవడంతో సమస్య వచ్చిందన్నారు. వ్యాపారం చేసుకునే వారికి కూడా అధికారుల చర్యలతో నష్టం కలుగుతుందన్నారు. పేదల ఇండ్లలోకి వెళ్లకుండా మార్గాలు మూసివేయడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కరెంటు స్థంభాలు తొలగిస్తున్నారని, దీంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెండు వైపుల సమానంగా స్థలం తీసుకుంటే డబుల్ లైన్లో రైళ్లు వెళ్లేందుకు సమస్య లేదన్నారు. అధికారులు అనవసరంగా పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పేదల ఇళ్లు కూలగొట్టిన, ఇబ్బందులు పెట్టిన ఎవరు పట్టించుకోరని అధికారులు అనుకుంటున్నారని, అవసరమయితే ఢిల్లీకి వెళ్లి పేదల పక్షాన పోరాటం చేస్తామన్నారు. వారికీ న్యాయ జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర గృహ దొంగ అరెస్ట్

- **రూ. 2.80 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**

**ముద్ర, కూకట్‌పల్లి :**




కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస గృహ దొంగతనాలకు పాల్పడుతున్న ఒక అంతర్రాష్ట్ర నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి భారీగా బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా చిలకలూరుపేటకు చెందిన పెదవల్లి సంజయ్ కుమార్ (25) ప్రస్తుతం హైదరాబాద్‌లోని హాఫీజ్‌పేట్, మియాపూర్‌లో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ఇతడు, తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ. 2,80,000 విలువ గల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సంజయ్ కుమార్‌పై గతంలోనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి మొత్తం 10 గృహ చోరీ కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, విచారణ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు.ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలాగే కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండండి

- **హైదరాబాద్ సీపీ సజ్జనార్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ యువతకు సూచించారు. సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్ సమాచారం ఉంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. క్రికెట్ అభిమానులకు కిక్కిచ్చే ఐపీఎల్ 19వ సీజన్ శనివారం బెంగుళూరులో ప్రారంభమైంది. దాదాపు రెండు నెలలపాటు ఐపీఎల్ లీగ్ అభిమానులను అలరించనుంది. ఇక క్రికెట్ అభిమానులతో పాటు బెట్టింగ్ రాయుళ్లు కూడా ఐపీఎల్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏడాది బెట్టింగ్ ద్వారా వేల కోట్లు చేతులు మారుతుంటాయి. ముఖ్యంగా యువత ఎక్కువగా బెట్టింగులకు పాల్పడి అప్పులపాలవుతున్నారు. ఈనేపథ్యంలో బెట్టింగ్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ శనివారం ఎక్స్ వేదికగా హెచ్చరికలు జారీ చేశారు. 'ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. గతంలో సే నో టు బెట్టింగ్ యాప్స్ ప్రచారం ద్వారా వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్‌హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంది. బెట్టింగ్ తో అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా కోరారు.

# వృత్తిపరమైన మీడియాను రాజకీయాల నుంచి వేరుచేయాలి






- **విజయవాడలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) 11వ ప్లీనరీలో ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు**
- **పక్షపాత ధోరణి సమాజానికి ప్రమాదకరం అని హెచ్చరిక**
- **రాజకీయ నాయకుల ఆధీనంలో మీడియా ఉండకూడదన్న సీఎం అభిప్రాయం**
- **వృత్తిపరమైన జర్నలిజానికి మద్దతు**
- **ఐజేయూ ప్లీనరీలో మీడియా స్వతంత్రత, జర్నలిస్టుల హక్కులపై కీలక చర్చలు**
- **వేతన సవరణలు లేక జర్నలిస్టుల పరిస్థితి దయనీయమని ఐజేయూ నాయకుల ఆవేదన**
- **డిజిటల్ మీడియా ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావంపై నేతల ఆందోళనలు**

**ముద్ర, అమరావతి:**

జర్నలిజం కాలక్రమేణా మారిపోయిందని, మీడియా లోని ఒక వర్గం పక్షపాత ధోరణికి లోనవడం సమాజానికి ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు మీడియా యాజమాన్యంలో ఉండకూడదని, వృత్తిపరమైన మీడియాను రాజకీయ మీడియా నుంచి వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

చంద్రబాబు మాట్లాడుతూ ఎమర్జెన్సీ, బోఫోర్స్ వంటి ఘటనల్లో మీడియా కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. జర్నలిస్టులు లేవనెత్తిన సమస్యలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అమరావతిని "హైదరాబాద్ ప్లస్"గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేసి వేతన సవరణలు చేపట్టాలని కోరారు. మీడియా స్వతంత్రతను కాపాడేందుకు చట్టపరమైన రక్షణ అవసరమన్నారు. మరొక సందర్భంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు అసంఘటిత రంగం కంటే దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. పని గంటలు, నైట్ డ్యూటీ నిబంధనలు అమలు కావడం లేదని విమర్శించారు. డిజిటల్ మీడియా ఒత్తిడి సంప్రదాయ మీడియాపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్వీందర్ సింగ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాభావ వ్యక్తీకరణపై అసహనం పెరుగుతోందన్నారు. దేశంలోనే కాక విదేశాల్లో కూడా జర్నలిస్టులు ప్రమాదాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ సోషల్ మీడియా నియంత్రణ లేకుండా పెరుగుతోందన్నారు. విలువల ఆధారంగా జర్నలిజం ఉండాలని సూచించారు. నియంత్రణ కాకుండా మార్గదర్శకాలు అవసరమన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రామారావు మాట్లాడుతూ మీడియా యాజమాన్యాల ప్రభావంలోకి వెళ్తోందన్నారు. పక్షపాతం లేకుండా స్వతంత్ర జర్నలిజాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుడు కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ డిజిటల్ ప్రభావంతో ప్రకటన ఆదాయాలు తగ్గుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వార్తల విశ్వసనీయతకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో లేకపోయినా మీడియా మద్దతు ఇచ్చిందన్నారు. ఉద్యమాల్లో మీడియా పాత్ర కీలకమని ప్రశంసించారు. ఈ ప్లీనరీలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణపై పలు తీర్మానాలు ఆమోదించారు. మూడు రోజుల సమావేశంలో దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా, ముగింపు రోజున ఎన్నికలు జరగనున్నాయి.



నేషనల్ మీడియా ప్రొటెక్షన్ యాక్ట్ రెసెల్యూషన్ యాక్ట్ ను ప్రవేశపెట్టిన ఐజేయూ నాయకులు నరేందర్ రెడ్డి

## జర్నలిస్టుల హక్కుల పునరుద్ధరణకు గళమెత్తిన ఐజేయూ

**ముద్ర, విజయవాడ :**

వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని పునరుద్ధరించడంతో పాటు కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, మీడియా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు కొత్త చట్టాలు తీసుకురావాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.., గత రెండు దశాబ్దాలుగా జర్నలిస్టులకు వేతన సవరణలు జరగకపోవడం వల్ల వారి పరిస్థితి అసంఘటిత రంగ కార్మికుల కంటే దారుణంగా మారిందన్నారు. "దృఢమైన, స్వతంత్ర మీడియా లేకుండా ప్రజాస్వామ్యం సజావుగా నడవదు. కానీ ప్రస్తుతం మీడియాను నిర్లక్ష్యం చేయడంతో పాటు ప్రభుత్వ నియంత్రణ పెరుగుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. పని గంటలు, నైట్ డ్యూటీ నిబంధనలు వంటి ప్రాథమిక అంశాలను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ (సోషల్) మీడియా ప్రభావంతో సంప్రదాయ మీడియా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, పత్రికలు, టీవీ ఛానెల్లు వీక్షకుల కోసం పోటీ పడుతున్నాయని పేర్కొన్నారు. న్యూఢిల్లీ లోని యూఎన్ఐ కార్యాలయాన్ని అధికార యంత్రాంగం స్వాధీనం చేసుకోవడం పెరుగుతున్న అసహనానికి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మరింత అధికారాలతో 'మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా'గా పునర్వ్యవస్థీకరించాలని ప్లీనరీ తీర్మానించిందని తెలిపారు. ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్వీందర్ సింగ్ జమ్మూ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితి దిగజారుతోందని, వారిపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టు ఆర్.వి. రామారావు మాట్లాడుతూ యాజమాన్యాల ఆధిపత్యంలో మీడియా స్వతంత్రత దెబ్బతింటోందని, భయభ్రాంతులు లేకుండా అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వతంత్ర మీడియాను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎల్. కృష్ణదేవరాయలు, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) సందేశాన్ని సురేష్ కుమార్ చదివి వినిపించారు. సభ ప్రారంభానికి ముందు ఐజేయూ నాయకులు మరణించిన సీనియర్ జర్నలిస్టులు అంబటి అంజనేయులు, కె. అమర్నాథ్, ప్రేమ్‌నాథ్ భార్గవ్, మణికొండ చలపతి రావులకు నివాళులు అర్పించారు. అనంతరం కె. శ్రీనివాస్ రెడ్డి ఐజేయూ జెండాను ఆవిష్కరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులకు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు నేతృత్వంలోని స్వాగత కమిటీ ఆతిథ్యం అందించింది. సాంస్కృతిక కార్యక్రమాలు సభకు ఆకర్షణగా నిలిచాయి. ఐపిటీఏ కళాకారులు దేశభక్తి గీతాలతో అలరించగా, మిమిక్రీ కళాకారుడు సిల్వెస్టర్ వినోదాన్ని పంచారు. నగరానికి చెందిన యువ కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మెప్పించారు.

# దేశంలో ఇంధన కొరత లేదు.. భవిష్యత్తులో రానివ్వం

- **దేశంలో సరిపడా నిల్వలున్నాయి**
- **ప్రజలెవరూ నిల్వలు చేసుకోవద్దు**
- **కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**

**ముద్ర, న్యూ ఢిల్లీ:**

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ప్రభావం ప్రస్తుతం దేశంలో ఏమాత్రం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిల్వలు దేశంలో సరిపడా ఉన్నాయన్న ఆయన ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంధన సరఫరా, ధరల విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. సరఫరా విషయంలో గతంలో రెండు, మూడు కంపెనీలకు కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురైన మాట వాస్తవమేనన్న ఆయన ప్రస్తుతం ఆ సమస్య పూర్తిగా పరిష్కారమైందని వెల్లడించారు. ఇంధన సరఫరా వ్యవస్థ ఇప్పుడు గాడిలో పడిందన్నారు. ప్రజలు ఎవరూ తొందరపడి నిల్వలు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. దేశంలో మళ్ళీ లాక్‌డౌన్ విధిస్తారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ప్రస్తుత పరిస్థితుల్లో లాక్‌డౌన్ ప్రసక్తే లేదన్నారు. కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల వద్ద అనవసరంగా క్యూ కట్టి ఆందోళన చెందవద్దని కోరారు. ఇతర దేశాల నుంచి రావాల్సిన ఇంధనాన్ని సకాలంలో వంద శాతం తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. అంతర్జాతీయంగా అనేక దేశాలు సుంకాలు పెంచుతున్నప్పటికీ, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ వంతుగా వ్యాట్ తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని ఆయన సూచించారు.



# శతాబ్దాల చరిత్ర గలది అమరావతి

- **అమరావతి రాజధానిగా కేంద్రానికి పంపే తీర్మాణంపై ఏపీ అసెంబ్లీలో చర్చ**
- **సింగపూర్ సహకారంతో రాజధాని నిర్మాణం**
- **ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**ముద్ర, అమరావతి:**



అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ కేంద్రానికి పంపే తీర్మానంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి ప్రాచీనత, చారిత్రక ప్రాధాన్యతను ప్రస్తావించారు. కృష్ణా-గోదావరి నదుల మధ్య ప్రాంతంగా ఉన్న అమరావతి శాతవాహనుల కాలంలోనే ప్రముఖ కేంద్రంగా వెలుగొందిందని తెలిపారు. బ్రిటిష్ మ్యూజియంలో కూడా అమరావతి గ్యాలరీ ఉండటం ఈ ప్రాంత గొప్పతనాన్ని చాటుతుందని చెప్పారు.రాష్ట్ర చరిత్రలో రాజధానుల మార్పులు, విభజనల వల్ల ఎదురైన ఇబ్బందులను గుర్తుచేసిన సీఎం, స్వీయ రాజధాని అవసరాన్ని వివరించారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ, త్వరగా సొంత రాజధాని నిర్మాణానికి కృషి చేశామని చెప్పారు. కేవలం 9 నెలల్లో అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించుకున్నామని తెలిపారు.సింగపూర్ సహకారంతో ఆధునిక రాజధాని నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జాతీయ స్థాయి సంస్థలను ఏర్పాటు చేశామని చెప్పారు. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాల భూమిని ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు కుట్రలు చేసినప్పటికీ, ఈ ప్రాంతం శాశ్వతంగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో అమరావతి కీలక పాత్ర పోషిస్తుందని సీఎం స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
29.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఐజేయూ : న్యాయపరమైన ప్రక్రియల ప్రాముఖ్యత
ఏ చర్యైనా సరైన విధానంలో జరగాలని IJU అంటుంది. ముందస్తు నోటీసులు, కారణాలు లేకుండా తీసుకునే నిర్ణయాలను వ్యతిరేకిస్తుంది.
IJU Indian Journalists Union

# ఘనంగా ఐపీఎల్ ప్రారంభం: బెంగళూరులో 'కిషన్' సునామీ

- నిప్పులు చెరిగిన ఇషాన్ బ్యాట్: 38 బంతుల్లోనే 80 పరుగులు
- కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్న 'కావ్య' నమ్మిన బంటు..
- 18 బంతుల్లో 43 పరుగులతో అనికేత్ విధ్వంసం
- దంచికొట్టిన సన్ రైజర్స్ బ్యాటర్లు
- నిర్ణీత 20 ఓవర్లలో ఎస్ఆర్‌హెచ్ స్కోరు 201/9
- బెంగళూరులో హైదరాబాద్ రచ్చ!

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 సీజన్ ఇవాళ (మార్చి 28) ప్రారంభమైంది. ఐపీఎల్ తొలి రోజున సన్ రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్స్ పోటీపడ్డాయి.. ఈ సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఒక విషాద జ్ఞాపకంతో నిశ్శబ్దమైంది. ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లో ఆర్‌సీబీ జట్టు తమ దివంగత అభిమానులకు అపూర్వ నివాళి అర్పించింది. గత ఏడాది జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది జ్ఞాపకార్థం స్టేడియంలో 11 సీట్లను ఖాళీగా ఉంచడంతో పాటు, రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**అభిమానుల పట్ల ప్రేమ**

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న ఈ పోరులో ఆర్‌సీబీ యాజమాన్యం తమ అభిమానుల పట్ల ఉన్న ప్రేమను చాటుకుంటూ ఎంతో భావోద్వేగపూరిత నిర్ణయం తీసుకుంది.

**11 మంది మృతి**

గత ఏడాది జూన్ 4న ఆర్‌సీబీ తొలిసారి టైటిల్ గెలిచిన సంబరాల్లో జరిగిన తొక్కిసలాటలో ఒక చిన్నారితో సహా 11 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ 11 ప్రాణాలకు గుర్తుగా ఈ మ్యాచ్‌లో ఆటగాళ్లు నల్ల రిబ్బన్లు ధరించి నివాళులు అర్పించారు.

**ఎప్పటికీ ఖాళీగానే ఆ 11 సీట్లు..**

గత ఏడాది జరిగిన ఆ దుర్ఘటనను గుర్తుచేసుకుంటూ, చిన్నస్వామి స్టేడియంలోని 11 సీట్లను ఈ సీజన్ మొత్తం ఖాళీగా ఉంచాలని ఆర్‌సీబీ నిర్ణయించింది. "మా కుటుంబంలో సభ్యులైన ఆ 11 మంది అభిమానులకు ఇది మా శాశ్వత నివాళి. వారి మద్దతు ఎప్పటికీ ఆర్‌సీబీ కుటుంబంలో భాగంగానే ఉంటుంది" అని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో తెలిపింది.

**11 మంది జ్ఞాపకార్థం**

కేవలం మ్యాచ్‌లోనే కాకుండా, ప్రాక్టీస్ సమయంలోనూ ఆటగాళ్లు 'నెంబర్ 11' కలిగిన జెర్సీలను ధరించి వారిని స్మరించుకున్నారు. మరోవైపు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (KSCA) ఆ 11 మంది జ్ఞాపకార్థం స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద ఒక స్మారక ఫలకాన్ని కూడా ఆవిష్కరించింది. గతేడాది జరిగిన చేదు అనుభవం దృష్ట్యా, ఈసారి ఐపీఎల్ ప్రారంభ వేడుకలను, ఆర్‌సీబీ అన్‌బాక్స్ ఈవెంట్‌ను అధికారులు రద్దు చేశారు.

**2 నిమిషాల పాటు మౌనం**

అలాగే, ఐపీఎల్ మొదటి మ్యాచ్ ఆరంభ సమయంలో మైదానంలోకి వెళ్లే ముందే బౌండరీ లైన్ వద్ద రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెట్ ప్లేయర్స్ మృతులకు 2 నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఆ సమయంలో స్టేడియంలోని ప్రేక్షకులంతా లేచి నిలబడి మృతులకు నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించారు.కాగా, ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ మొదట ఫీల్డింగ్ ఎంచుకున్నారు. ఈ మ్యాచ్ ద్వారా ఆర్‌సీబీ తరపున అభినందన్ సింగ్, జాకబ్ డఫీ అరంగేట్రం చేస్తుండగా, ఇంగ్లాండ్ ఆటగాడు జాకబ్ బెథెల్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా రానున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ అన్‌క్యాప్డ్ ప్లేయర్ సలిల్ అరోరాకు అవకాశం ఇచ్చింది.

**దంచికొట్టిన సన్ రైజర్స్ బ్యాటర్లు..**
**201/9 భారీ స్కోరు**

ఐపీఎల్ కొత్త సీజన్ ప్రారంభ మ్యాచ్‌లోనే సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్.ఆర్.హెచ్) బ్యాటర్లు జూలు విదిల్చారు. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన పోరులో ఇషాన్ కిషన్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగిపోవడంతో హైదరాబాద్ జట్టు గౌరవప్రదమైన స్కోరును సాధించింది. ఒకానొక దశలో 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును ఇషాన్ కిషన్ తన వీరోచిత బ్యాటింగ్‌తో గట్టెక్కించాడు.

**కుప్పకూలిన టాప్ ఆర్డర్..**


టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. స్టార్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (11), అభిషేక్ శర్మ (7) దారుణంగా విఫలమయ్యారు. యువ ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి (1) కూడా నిరాశ పరచడంతో స్టేడియంలోని ఆరెంజ్ ఆర్మీ అభిమానులు నిశ్శబ్దంలో మునిగిపోయారు. 29 పరుగులకే మూడు కీలక వికెట్లు పడటంతో హైదరాబాద్ స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందని అంతా భావించారు.

**కిషన్ - క్లాసెన్ 'షాన్ దార్' పార్ట్‌నర్‌షిప్**

ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 38 బంతుల్లో 8 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 80 పరుగులు సాధించి ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేశాడు. హెన్రిచ్ క్లాసెన్ (31)తో కలిసి నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఝార్ఖండ్ తరపున డొమెస్టిక్ క్రికెట్‌లో సెంచరీతో మెరిసిన ఫామ్‌ను కిషన్ ఇక్కడ కూడా కొనసాగించి, యజమాని కావ్య మారన్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.

**ముగింపులో అనికేత్ మెరుపులు**

సెంచరీ దిశగా సాగుతున్న కిషన్.. సాల్ట్ పట్టిన అద్భుతమైన క్యాచ్‌కు వెనుదిరగాల్సి వచ్చింది. క్లాసెన్ కూడా పెవిలియన్ చేరడంతో స్కోరు వేగం తగ్గుతుందనుకున్న తరుణంలో.. అనికేత్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 18 బంతుల్లో 43 పరుగులతో సిక్సర్ల వర్షం కురిపించడంతో హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.



# షోయబ్ మాలిక్ రికార్డుపై కోహ్లీ కన్ను..

- ఐపీఎల్ 2026లో ఆసియా నంబర్ వన్ అవుతాడా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీకి ఐపీఎల్ 2026 తొలి మ్యాచ్ చాలా ప్రత్యేకంగా మారే అవకాశం ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ ద్వారా టీ20 క్రికెట్‌లో మరో అరుదైన రికార్డును అందుకునే అవకాశం కోహ్లీకి లభించింది. చాలా రోజుల తర్వాత మైదానంలోకి దిగుతున్న కోహ్లీపై అభిమానులందరి దృష్టి కేంద్రీకృతమైంది.

టీ20 ఫార్మాట్‌లో కోహ్లీ ఇప్పటికే అద్భుతమైన గణాంకాలు నమోదు చేశాడు. ఇప్పటివరకు 414 మ్యాచ్‌లు ఆడి 13,543 పరుగులు సాధించిన కోహ్లీ, షోయబ్ మాలిక్ పేరిట ఉన్న ఆసియా బ్యాట్స్‌మెన్ అత్యధిక పరుగుల రికార్డును బద్దలు కొట్టడానికి కేవలం 29 పరుగుల దూరంలో ఉన్నాడు. మాలిక్ తన కెరీర్‌లో 13,571 పరుగులు చేసి ఈ రికార్డును సొంతం చేసుకున్నాడు. అందువల్ల హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌లో కోహ్లీ ఈ మైలురాయిని చేరుతాడా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఇదిలా ఉండగా టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. గేల్ 14,562 పరుగులతో ఇప్పటికీ టాప్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం టీ20లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో కోహ్లీ ఏడో స్థానంలో ఉన్నాడు. మంచి ఫామ్‌లో ఉన్న కోహ్లీ ఈ సీజన్‌లోనే మరిన్ని రికార్డులు బద్దలు కొట్టే అవకాశముందని అభిమానులు ఆశిస్తున్నారు.

# డఫీకి తొలి మ్యాచ్‌లోనే వికెట్..
# అభిషేక్ శర్మ నిరాశ



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో భారత్ తరఫున విధ్వంసకరమైన ఇన్నింగ్స్ ఆడి హీరోగా నిలిచిన అభిషేక్ శర్మ, ఐపీఎల్ 2026 తొలి మ్యాచ్‌లో మాత్రం ఆశించిన ప్రదర్శన చేయలేకపోయాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్‌లో అభిషేక్ కేవలం 8 బంతుల్లో 7 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీకి ఇది ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్. తొలి ఓవర్‌లోనే అభిషేక్ శర్మ బౌల్డ్ అయినా, ఒక భారీ సిక్స్ కొట్టి ఆకట్టుకున్నాడు. అయితే రెండో ఓవర్‌లో డఫీ బౌలింగ్‌లోనే మరోసారి ప్రమాదకరంగా ఆడే ప్రయత్నంలో అభిషేక్ వికెట్ కోల్పోయాడు. షార్ట్ పిచ్ బంతిని పుల్ చేయాలని ప్రయత్నించి సరిగా కనెక్ట్ చేయలేకపోయాడు. వికెట్ కీపర్ జితేష్ శర్మ సులభంగా క్యాచ్ పట్టడంతో అభిషేక్ ఇన్నింగ్స్ ముగిసింది. టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో కేవలం 21 బంతుల్లో 52 పరుగులు చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పిన అభిషేక్, డఫీ బౌలింగ్‌లోనే 9 బంతుల్లో 29 పరుగులు సాధించిన విషయం అభిమానులకు గుర్తుంది. అయితే అదే బౌలర్‌పై ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో త్వరగా ఔట్ కావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల కాలంలో అభిషేక్ శర్మ ఫామ్ కూడా అంతగా మెరుగ్గా లేదు. ప్రపంచకప్ ప్రారంభ మ్యాచ్‌లలో వరుసగా విఫలమైన అతను, జింబాబ్వేపై ఒక అర్ధశతకం, ఫైనల్‌లో మరో ఫిఫ్టీ సాధించాడు. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో కూడా త్వరగా ఔట్ కావడంతో అభిమానులు అతని ఫామ్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.




# తెలంగాణలో క్రీడా స్ఫూర్తి తగ్గింది: సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రేవంత్ రెడ్డి తెలంగాణలో ఒకప్పుడు క్రీడల రాజధానిగా గుర్తింపు పొందిన రాష్ట్రంలో ఇప్పుడు క్రీడా స్ఫూర్తి తగ్గిపోవడం బాధాకరమని అన్నారు. గత పదేళ్లలో సరైన స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించకపోవడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్లో నిర్వహించిన ఎమ్మెల్యేల స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీను హైదరాబాద్‌కు తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికీ కొందరు దానిని కూడా రాజకీయంగా మార్చారని ఆయన విమర్శించారు. క్రీడలను కూడా రాజకీయ కోణంలో చూడటం సరైంది కాదని, రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచానికి చాటిచెప్పేందుకే మెస్సీని ఆహ్వానించామని తెలిపారు. మెస్సీ హైదరాబాద్‌కు రావడం ద్వారా నగరానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే గచ్చిబౌలి స్టేడియంలో ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా మరింత సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. బేగంపేట హాకీ మైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తామని సీఎం వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి కూడా ఎంతో అవసరమని సీఎం అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు కూడా క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి ఫుట్‌బాల్ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు.

# కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ అరంగేట్రం..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభ మ్యాచ్ బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత వికెట్ కీపర్‌బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ తొలిసారిగా ఐపీఎల్‌లో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఇప్పటివరకు 119 మ్యాచ్‌లు ఆడిన తర్వాత కిషన్‌కు ఈ అవకాశం లభించడం ప్రత్యేకంగా నిలిచింది. తన కెప్టెన్సీ అరంగేట్ర మ్యాచ్‌లోనే ఇషాన్ కిషన్ అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. ఒత్తిడిలోనూ ధైర్యంగా ఆడుతూ జట్టుకు బలమైన స్కోర్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. తన ఇన్నింగ్స్‌తో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న కిషన్, అదే సమయంలో ఒక ముఖ్యమైన రికార్డును కూడా తన పేరుపై నమోదు చేసుకున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. కమిన్స్ గైర్హాజరీలో జట్టు యాజమాన్యం ఇషాన్ కిషన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు కిషన్ జట్టును నడిపించనున్నాడు. అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్‌గా నియమించినట్లు జట్టు వర్గాలు తెలిపాయి. తొలి మ్యాచ్‌లోనే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టి అద్భుత ప్రదర్శన చేయడంతో కిషన్‌పై అభిమానుల అంచనాలు మరింత పెరిగాయి. ఈ సీజన్‌లో అతను కెప్టెన్‌గా ఎలా రాణిస్తాడో చూడాలని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు



# ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లో నివాళులు..

- నల్ల బ్యాండ్లతో మైదానంలోకి ఆర్‌సిబి – ఎస్‌ఆర్‌హెచ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌కు శనివారం ఘన ఆరంభం జరిగింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ ఆర్‌సిబి, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి మ్యాచ్‌లో తలపడుతున్నాయి. మ్యాచ్ ప్రారంభానికి ముందు భావోద్వేగ దృశ్యాలు కనిపించాయి. గత ఏడాది జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన అభిమానులకు నివాళిగా ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులు ఒక నిమిషం మౌనం పాటించారు. ఇరు జట్ల ఆటగాళ్లు నల్లటి ఆర్మ్ బ్యాండ్లు ధరించి మైదానంలోకి దిగారు. మ్యాచ్ విషయానికి వస్తే ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆశించిన ఆరంభం రాలేదు. స్టార్ ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ తక్కువ స్కోరుకే అవుట్ కావడంతో హైదరాబాద్ జట్టు 23 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. టాస్ అనంతరం మాట్లాడిన రజత్ పాటిదార్ ఈ సీజన్‌లో కూడా టైటిల్ గెలవాలనే లక్ష్యంతో మైదానంలోకి దిగుతున్నామని తెలిపారు. గత సీజన్‌లో తొలి ఐపీఎల్ ట్రోఫీని గెలిచిన ఆర్‌సిబి ఈసారి కూడా అదే జోష్‌తో ఆడుతుందని అన్నారు. అభిమానులు భారీ సంఖ్యలో స్టేడియానికి చేరుకుని సీజన్ ప్రారంభానికి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
29.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఐజేయూ : మీడియా స్వతంత్రతకు రక్షణ కవచం

స్వతంత్ర జర్నలిజాన్ని కాపాడటంలో IJU కీలక పాత్ర పోషిస్తుంది. మీడియాపై ఒత్తిడులను ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది.

IJU Indian Journalists Union

# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న ధురంధర్2..

- 9 రోజుల్లోనే రూ.1,100 కోట్లకు పైగా వసూళ్లు

**ముద్ర, సినిమా డెస్క్:**



బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' వసూళ్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకూ ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1,128 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలైన తొమ్మిదో రోజునే హిందీ వెర్షన్ నుంచి రూ.41.55 కోట్లు రాగా, తెలుగులో రూ.2.85 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో షోలు పడుతుండటంతో ఈ సినిమా ఇప్పటికే అనేక రికార్డులను బద్దలు కొడుతోంది.

ఈ చిత్ర వసూళ్లు పెరుగుతున్న కొద్దీ గతంలో భారీ వసూళ్లు సాధించిన సినిమాల రికార్డులు కూడా ప్రమాదంలో పడుతున్నాయి. ముఖ్యంగా 'పుష్ప' ఫ్రాంఛైజీ రికార్డులను ఈ సినిమా దాటేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే 'బాహుబలి 2' (రూ.1,810 కోట్లు), 'పుష్ప 2' (రూ.1,800 కోట్లు) చిత్రాల స్థాయికి ఇంకా చేరలేదు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 'దంగల్' (రూ.2,024 కోట్లు) రికార్డు ఇప్పటికీ కొనసాగుతోంది.

ఇదిలా ఉండగా 'ధురంధర్ 2' మంచి వసూళ్లు రాబడుతున్నా, కొన్ని కారణాల వల్ల లెక్కలు వేగంగా పెరగడం లేదని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 'పార్ట్ 1'ను కేవలం హిందీలో మాత్రమే విడుదల చేయడం వల్ల ఇతర భాషల్లో పెద్దగా మార్కెట్ ఏర్పడలేదని అంటున్నారు. అయితే ఈసారి ఆ తప్పు చేయకుండా చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేశారు. అయినా కూడా ప్రారంభ రోజుల్లో సెన్సార్, సాంకేతిక సమస్యల కారణంగా తెలుగు, తమిళ ప్రీమియర్స్ ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ టికెట్ ధరలు పెంచకుండా విడుదల చేసిన ఈ సినిమా 9 రోజుల్లోనే రూ.1,100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషంగా మారింది.

# వాలీబాల్ బరిలోకి వరుణ్ తేజ్

- మరోసారి స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో మెగాప్రిన్స్
- కొత్త సినిమాకి క్లాప్ కొట్టిన పవర్ స్టార్

**ముద్ర, సినిమా డెస్క్:**



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మరోసారి క్రీడాకారుడిగా కనిపించబోతున్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న కొత్త చిత్రం 'బరి' పూజా కార్యక్రమాలతో శనివారం ఘనంగా ప్రారంభమైంది. నిహారిక కొణిదెల నిర్మాతగా, యదు వంశీ దర్శకత్వంలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా చిత్ర బృందం సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. వరుణ్ తేజ్ మాట్లాడుతూ తన తొలి చిత్రం 'ముకుంద' తర్వాత మళ్లీ పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సినిమా ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని, టీంపై నమ్మకం ఉండటంతో వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు ఒప్పుకున్నానని తెలిపారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, పాత్ర కోసం తాను వాలీబాల్ ప్రాక్టీస్ కూడా ప్రారంభించానని చెప్పారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి సినిమా నిర్మించడం తనకు ప్రత్యేక అనుభూతి అని తెలిపారు. అన్న వరుణ్ తేజ్‌తో కలిసి సినిమా ప్రారంభించడం ఎంతో స్పెషల్‌గా అనిపిస్తోందని చెప్పారు. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతుందని, ప్రేక్షకులకు కొత్త తరహా కథను అందిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి వచ్చే సంక్రాంతికి 'బరి' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది.

# కొత్త ఫోటోషూట్‌తో మళ్లీ హాట్ టాపిక్ గా కల్యాణి

**ముద్ర, సినిమా డెస్క్ :**

మలయాళ – తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ కల్యాణి ప్రియదర్శన్ 'లోకా' సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఆ సినిమా తర్వాత ఆమె టాప్ లీగ్ హీరోయిన్లలోకి వెళ్లిపోతుందని చాలామంది భావించినప్పటికీ, ఆ స్థాయి బ్రేక్ ఇంకా పూర్తిగా రాలేదనే అభిప్రాయం ఇండస్ట్రీలో వినిపిస్తోంది.ప్రస్తుతం ఆమె చేతిలో 'జెనీ', 'మార్షల్' వంటి సినిమాలు ఉన్నప్పటికీ, పెద్ద బజ్ మాత్రం ఇంకా పూర్తిగా క్రియేట్ కాలేదు. అయితే 'లోకా చాప్టర్ 2' వస్తే ఆమె కెరీర్‌కు మరింత బూస్ట్ దక్కే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ లోపులో మ్యాగజైన్ కవర్లు, ఇంటర్వ్యూలతో కల్యాణి తన క్రేజ్‌ను కొనసాగించే ప్రయత్నం చేస్తోంది.ఇదిలా ఉండగా తాజాగా చేసిన ఫోటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. డీప్ గ్రీన్ కలర్ బాడీ హగ్గింగ్ డ్రెస్‌లో కల్యాణి ఎంతో ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సింపుల్ స్టైల్‌లోనే ఆమె లుక్ ఆకట్టుకుంటోంది. సాఫ్ట్ వేవీ హెయిర్, మినిమల్ మేకప్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయింది. ఈ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె స్టైల్, ఎలిగెన్స్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.



# విజయ్ జన నాయగన్ విడుదల మళ్లీ వాయిదా?..

**ముద్ర, సినిమా డెస్క్:**



విజయ్ నటించిన తాజా చిత్రం 'జన నాయగన్' విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు. మొదట ఈ సినిమాను 2026 ప్రారంభంలోనే విడుదల చేయాలని భావించినప్పటికీ, సెన్సార్ సమస్యల కారణంగా అది వాయిదా పడింది. తాజాగా వచ్చిన సమాచారం ప్రకారం ఈ చిత్రం విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

విజయ్ పుట్టినరోజు సందర్భంగా జూన్‌లో సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేసినట్లు గతంలో వార్తలు వచ్చాయి. జూన్ 22న ఆయన పుట్టినరోజు కావడంతో జూన్ 18న సినిమాను రిలీజ్ చేయాలని అనుకున్నప్పటికీ, ఆ తేదీకి కూడా సినిమా రావడం కష్టమేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ చేతిలో ప్రస్తుతం మరో భారీ ప్రాజెక్ట్ కూడా ఉంది. యశ్ హీరోగా రూపొందుతున్న 'టాక్సిక్' జూన్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. దీంతో 'జన నాయగన్'ను జూలైలో విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా సినిమా విడుదల ఆలస్యం అవుతుండటంతో చిత్ర బృందానికి మరో సమస్య ఎదురైనట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ ఒప్పందం కూడా సందిగ్ధంలో పడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. స్ట్రీమింగ్ పార్ట్‌నర్ ఇప్పటికే ఈ ఒప్పందం నుంచి వెనక్కితగ్గే యోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు.



# గ్రాజియా పై కియారా హాట్ షో

**ముద్ర, సినిమా డెస్క్ :**

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి ఆమె రాబోయే సినిమా మాత్రమే కాదు, తాజాగా చేసిన గ్లామరస్ ఫోటోషూట్ కూడా భారీ చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా 'టాక్సిక్' సినిమాపై ఆసక్తి పెరుగుతున్న సమయంలో కియారా చేసిన గ్రాజియా కవర్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోషూట్‌లో కియారా పూర్తిగా కాన్ఫిడెన్స్‌తో మెరిసింది. క్రీమ్ కలర్ ఔట్‌ఫిట్‌లో పెర్ల్ డీటెయిల్స్‌తో కనిపించిన లుక్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ఆ డ్రెస్ ఆమె లుక్‌ను ఎలిగెంట్‌గా హైలైట్ చేస్తూ గ్లామర్ టచ్ కూడా ఇచ్చింది. మరో లుక్‌లో వైట్ టాప్, డ్రేప్ స్టైల్ స్కర్ట్‌తో మినిమల్ స్టైలిష్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఆకర్షించింది. వేవీ హెయిర్, సాఫ్ట్ మేకప్‌తో ఆమె లుక్ మరింత అందంగా కనిపిస్తోంది. ఈ ఫోటోల్లో కియారా చూపించిన కాన్ఫిడెన్స్‌నే అభిమానులు ఎక్కువగా ప్రశంసిస్తున్నారు. రిలాక్స్ పోజ్ అయినా, బోల్డ్ స్టైల్ అయినా ఆమె ఎంతో నేచురల్‌గా కనిపిస్తోందని కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటికే 'టాక్సిక్' సినిమాపై భారీ అంచనాలు ఉండగా, ఈ కొత్త ఫోటోలు ఆ అంచనాలను మరింత పెంచేశాయి. సినిమా జూన్‌లో విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కియారా గ్లామర్ మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com